మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 170 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## రూ.5వేల కోట్లతో 120 గురుకుల పాఠశాల భవనాలు

**స్థలాల ఎంపిక..డిజైన్లు పూర్తి చేయాలి - అధికారులతో సమీక్షలో డిప్యూటి సిఎం భట్టి**



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ వ్యాప్తంగా ఈ ఏడాది రూ. 5వేల కోట్లతో 30 ప్రాంతాల్లో 120 గురుకుల పాఠశాల భవనాలు నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సమీకృత గురుకుల సముదాయాల కోసం నియోజక వర్గాల్లో స్థలాలు, డిజైన్ల ఎంపిక వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ఉన్నతాధి కారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. గురుకులాల ఏర్పాటుకు

మిగతా 2లో..

# దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ

- స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం
- క్రీడాకారులను గుర్తించి ప్రోత్సాహక శిక్షణ ఇవ్వాలి
- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ సిఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్, (ప్రజా మంటలు): దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ యూనివర్సిటీపై ఆయన వారితో చర్చించారు. ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏవిధంగా ఉండాలనే దానిపై పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం ఉండాలని, అన్ని రకాల క్రీడలను, క్రీడా శిక్షణ సంస్థలను ఒకే గొడుగు కిందకు తేవడమే స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యమన్నారు. మన దేశంతో పాటు తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులు, మన శారీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలు ఏవో గుర్తించి, క్రీడలపై ఉత్సాహం ఉన్న వారిని గుర్తించి వారిని ఆయా క్రీడల్లో ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దశాబ్దాల క్రితమే ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు వేదికగా మార్చాలని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడలో మన క్రీడాకారులు పతకాలు దక్కేలా వారిని తీర్చి దిద్దాలని, అందులో మన స్పోర్ట్స్ యూనివర్సిటీ క్రీడాకారులు కచ్చితంగా ఉండాల్సిదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం వారికి నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణ సంస్థలు అన్నింటిని స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, అర్చరీ, జావెలిన్ త్రో, హాకీకి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత శిక్షణ ద్వారా పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. యూనివర్సిటీలో ఆయా క్రీడల్లో శిక్షణకు అవసరమైన వసతులు, ఆహారంతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉన్నతనం లోనే విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు, వారికి ఏ క్రీడలపై మక్కువ ఉందో ఉపాధ్యాయులు గుర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు. అటువంటి విద్యార్థులం దరికీ ఆయా క్రీడల్లో శిక్షణ

మిగతా 2లో..

## 370 ఆర్టికల్‌ను పునరుద్ధరిస్తాం

**ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన నేషనల్ కాన్ఫరెన్స్**



శ్రీనగర్,ఆగస్ట్19 (ప్రజా మంటలు): జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ సందడి మొదలయ్యింది. ఈ అసెంబ్లీ ఎన్నికలు మూడు విడతలుగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా సోమవారం శ్రీనగర్‌లో తమ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఆర్టికల్ 370తోపాటు 35ఏని పునరుద్ధరిస్తామని ఆయన స్పష్టం చేశారు. వీటితోపాటు మరో 10 అంశాలను మేనిఫెస్టో జాబితాలో పొందు పరిచారు. ప్రజా భద్రత చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. అలాగే రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని తెలిపారు. భారత్, పాక్ మధ్య నిలిచిపోయిన చర్చలను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుక బడిన మహిళలకు ఏడాదికి 12 గ్యాస్ సిలెండర్లు అందజేస్తామన్నారు. అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాశ్మీర్ పండిట్లకు పూర్వ వైభవం తీసుకు వస్తామని తెలిపారు.

## ప్రధాని మోడీకి రాఖీ కట్టిన చిన్నారులు



న్యూఢిల్లీ (ప్రజా మంటలు): దేశవ్యాప్తంగా రాఖీ పౌర్ణమి పండుగను ఘనంగా జరుపు కున్నారు.. రక్షా బంధన్ ను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరంద్ర మోడీకి చిన్నారులు రాఖీ కట్టారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలోని

మిగతా 2లో..

### పొలిట్రిక్స్

ఆ మాఫీ, ఈ మాఫీ
ఎన్ని మాఫీలెట్టినా ,
దేశంలో పేదరికం
తగ్గుముఖం పట్టునా?

హామీ తుమీ తేలేదాకా
తలకాయలు పండినా,
ఫలితమెచట ఉన్నదోయ్
'పత్తిత్తు'లే అందరైనా...!

- న్యాలకంటి నారాయణ
9346200066

# క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి దయనీయం

**క్యాబ్‌లో ప్రయాణించి సమస్యలు తెలుసుకున్న రాహుల్**



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారుతోంది. రైడ్ బుక్ అయితేనే పని. లేదంటే లేదు.. తొలుత ఉబెర్, ఓలా ఇతర కంపెనీలు డ్రైవర్లకు మంచి కమీషన్ ఇచ్చేవి. తర్వాత కమీషన్లు తగ్గించాయి. రైడ్స్ ఆశించిన స్థాయిలో రావడం లేదు. మెట్రో పాలిటన్ సిటీలో కుటుంబాన్ని పోషించేంత ఆదాయం డ్రైవర్లు పొందడం లేదు. ఇదే విషయాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గుర్తు చేశారు. సోమవారం రాహుల్ గాంధీ ఉబెర్ క్యాబ్ బుక్ చేసుకొని ఢిల్లీలో ప్రయాణించారు. ఉత్తరప్రదేశ్ ఎటావాకు చెందిన డ్రైవర్ సునీల్ ఉపాధ్యాయత్‌లో 11 నిమిషాల పాటు మాట్లాడారు. డ్రైవర్ తన సమస్యలను రాహుల్ గాంధీకి వివరించారు. ఆ వీడియోను రాహుల్ గాంధీ సోషల్ మీడియా ఎక్స్‌లో ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు స్పష్టమైన విధానాలను రూపొందిస్తామని రాహుల్ గాంధీ వివరించారు. ఆ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ఇండియా కూటమి కృషి చేస్తోందని స్పష్టం చేశారు. 'తక్కువ ఆదాయం, ద్రవ్యోల్బణం వల్ల క్యాబ్ డ్రైవర్లు లాంటి చిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇది దేశంలోని కార్మికుల పరిస్థితికి అద్దం పడుతోంది. ఉబెర్ కారులో ప్రయాణించే సమయంలో డ్రైవర్ సునీల్ ఉపాధ్యాయ్‌తో ఇదే విషయం మాట్లాడా. తర్వాత అతని కుటుంబాన్ని కలిశాను. క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించా. డ్రైవర్లు అహో రాత్రులు కష్టపడతారు. డ్రైవర్లు ఎలాంటి పొదుపు చేయరు. కుటుంబ భవిష్యత్ కోసం ఏమి కూడబెట్టరు. క్యాబ్ డ్రైవర్ల సమస్యలపై కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన విధానాలు రూపొందించి న్యాయం చేస్తాయి అని' రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. 'డ్రైవర్లకు సామాజిక భద్రత ఉండటం లేదు. రైడ్స్ అంత ఈజీగా బుక్ కావడం లేదు.

## కాశ్మీర్‌లో ఉగ్రవాదుల మెరుపుదాడి


**దాడిలో సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారి మృతి**

శ్రీనగర్,ఆగస్ట్19 (ప్రజా మంటలు): జమ్మూ కశ్మీర్‌లో ఉదంపూర్ జిల్లాలోని దుడు ప్రాంతంలో సోమవారం ఉగ్రవాదులు మెరుపు దాడికి దిగారు. ఈ దాడిలో సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారి మరణించారు. దుడు ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బెటాలియన్‌ను మరింతగా మోహరించేందుకు భారత సైన్యం చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో బెటాలియన్‌పై ఉగ్రవాదులు మెరుపు దాడికి దిగి.. కాల్పులు జరిపారు. దీంతో సీఆర్పీఎఫ్ అధికారి మరణించారు. జమ్మూలోని కొండ ప్రాంతంలో ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు భారత సైన్యం శ్రీకారం చుట్టింది. ఆ ప్రదేశంలో సీఆర్పీఎఫ్ పోస్ట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాకాలు చేస్తుంది. అందులో భాగంగా

మిగతా 2లో..



## ప్రజా నాడి




## సిఎం సిద్ధరామయ్యకు తాత్కాలిక ఉపశమనం

**ఎలాంటి చర్యలు తీసుకో వద్దని హైకోర్టు ఆదేశం**



బెంగళూరు, ఆగస్ట్ 19 (ప్రజా మంటలు): కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఆగస్ట్ 29వ తేదీ వరకు ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకో వద్దని ట్రయిల్ కోర్టును కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ముడా కుంభకోణం లో సీఎం సిద్ధరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ తవర్‌చంద్ గెహ్లాత్ అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. గవర్నర్ ఆదేశాలను నిలిపి వేయాలంటూ సీఎం సిద్ధరామయ్య సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌పై సింగిల్ బెంచ్ జడ్జి హేమంత్ చందన్‌గౌడ్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీఎం సిద్ధ రామయ్య తరపు న్యాయవాదీ అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలను విని పించారు. ఆ క్రమంలో ఆగస్ట్ 29వ తేదీ వరకు సీఎం సిద్ధరామయ్యను ఎలాంటి విచారణ జరప వద్దని న్యాయ మూర్తికి వివరించారు. దీంతో న్యాయవాది సింఘ్వీ వాదనలతో సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన గౌడ్ ఏకీభవించారు. దీంతో ఆగస్ట్ 29వ తేదీ వరకు ఆయనపై

మిగతా 2లో..

## హాలో లైబ్రరీ గర్ల్?..

**ఆకర్షణను అప్యాయంగా పలకరించిన ప్రధాని**
**అనందంతో ఉబ్బితబ్బిబైన ఆకర్షణ**



సికింద్రాబాద్, ఆగస్ట్ 19 (ప్రజామంటలు ) హైదరాబాద్? కు చెందిన 8వ క్లాస్? చదువుతున్న 12ఏండ్ల ఆకర్షణ ను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అభినందించారు. ఈనెల 15న న్యూఢిల్లీ లోని రాష్ట్రపతి భవన్? లో జరిగిన ఎట్? హోమ్? కార్యక్రమానికి హాజరైన అథిధుల సమూహంలో ఉన్న ఆకర్షణను గుర్తుపట్టిన ప్రధాని మోదీ హలో లైబ్రరీ గర్ల్...?..అంటూ పలకరించడంతో తామంతా ఆశ్చర్యపోయామని ఆకర్షణ తండ్రి సతీష్? తెలిపారు. ఆకర్షణ తన సొంత ఖర్చులతో బుక్స్? కొని వరసగా అనాధాశ్రయాలు, పాఠశాలల్లో లైబ్రరీలను ఏర్పాటు చేస్తుంది. ఇంతవరకు 15 లైబ్రరీలను ఏర్పాటు చేసిన ఆకర్షణ ను కొంతకాలం క్రితం ప్రధానమంత్రి మోదీ ఆకర్షణను పిలిపించి, అభినందించారు. తన 25వ లైబ్రరీ ప్రారంభోత్సవానికి తాను వస్తానని ప్రధాని హామీ కూడ ఇచ్చారని ఆమె తెలిపారు. కాని రాష్ట్రపతి భవన్? లో జరిగిన ఎట్ హోమ్? కార్యక్రమంలో తనను గుర్తుంచుకొని లైబ్రరీ గర్ల్ అంటూ పలకరించడం ఆనందంగా ఉందని ఆకర్షణ పేర్కొంది. రాష్ట్రపతి భవన్? ఆహ్వానం మేరకు ఇండిపెండెన్స్? డే వేడుకలకు ఆకర్షణ ఆమె పేరేంట్స్? తో కలసి న్యూఢిల్లీ వెళ్లి, వచ్చారు.

మొదటి పేజీ తరువాయి

## దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ

ఇచ్చేలా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ పాఠశాలల్లో విద్యా బోధనతో ఉంటుందని అయితే క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, విద్యార్థులకు అక్కడ వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణ ఇచ్చి, ప్రతిభ ఆధారంగా వారికి స్పోర్ట్స్ యూనివర్సిటీలో వసతి కల్పించి మరింత పదును తేలేలా శిక్షణ ఇప్పించాలన్నారు.. హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా ఉండాలని, అందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన దేశాలు, క్రీడాకారుల వివరాలను సేకరించి, ఆయా క్రీడాకారులు పతకాల సాధనకు శ్రమించిన తీరు, ఆయా దేశాలు వారిని ప్రోత్సహించిన తీరు, వారికి ఇచ్చిన శిక్షణ, ప్రోత్సాహం తదితరాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇప్పటికే స్కిల్ యూనివర్సిటీకి యంగ్ ఇండియా పేరు పెట్టామని, స్పోర్ట్స్ యూనివర్సిటీ యంగ్ ఇండియా పేరు ఖరారు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు యంగ్ ఇండియా పేరు పెడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాల్లో తెలంగాణ ఒక శక్తిమంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## రూ.5వేల కోట్లతో 120 గురుకుల పాఠశాల భవనాలు

గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 25 ఎకరాలు, పట్టణాల్లో 10 నుంచి 15 ఎకరాల భూమి సేకరించాలన్నారు. గురుకులాల్లో అవసరమైన సదుపాయాలపై ఈ నెల 29లోగా నివేదిక సమర్పించాలని విద్యాశాఖను ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపై డిప్యూటీ సీఎం భట్టి సానుకూలంగా స్పందించారు. పెండింగులో స్కాలర్‌షిప్ బకాయిల జాబితా ఇవ్వాలని అధికారులకు తెలిపారు. నిర్ణీత గడువులోగా ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయించుకునే బాధ్యత అధికారులదేనని చెప్పారు.

## సిఎం సిద్దరామయ్యకు తాత్కాలిక ఉపశమనం

ఎటువంటి చర్యలు తీసుకో వద్దని ఆదేశించింది. మైసూర్ నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణంలో సీఎం సిద్దరామయ్య ప్రమేయం ఉందంటూ.. సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ, టీజే అబ్రహం తదితరులు.. ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ప్రత్యేక కోర్టుకు గవర్నర్ తావర్ చంద్ గెహ్లాత్ ఆగస్ట్ 17వ తేదీన అనుమతి ఇస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను వెంటనే రద్దు చేయాలంటూ సిఎం సిద్దరాయమ్య.. సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌ను సోమవారం సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ విచారించారు. సీఎం సిద్దరామయ్యను ఆగస్ట్ 29వ తేదీ వరకు ప్రాసిక్యూషన్ చేయకూడదంటూ సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ ఆదేశించారు. దీంతో సీఎం సిద్దరామయ్యనకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లు అయింది.

## క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి దయనీయం

బుక్ అయిన తక్కువ కమీషన్ వస్తోంది. తక్కువ వేతనంతో జీవనం కొనసాగిస్తున్నాం. ఒకానొక సందర్భంలో సొంత ఊరికి వెళదామని అనుకున్నా. క్యాబ్ నడిపి ఢిల్లీలో జీవించడం కష్టమని తెలిసింది అని' క్యాబ్ డ్రైవర్ సునీల్ ఉపాధ్యాయ్ రాహుల్ గాంధీకి వివరించారు.రాహుల్ గాంధీ రైడ్ ముగిసిన తర్వాత డ్రైవర్ పిల్లలకు బహుమతి అందజేశారు. ఆ మరుసటి రోజు క్యాబ్ డ్రైవర్ కుటుంబంతో రాహుల్ గాంధీ భోజనం కూడా చేశారు. క్యాడ్ డ్రైవర్ల గురించి కాంగ్రెస్ పార్టీ ఆలోచన చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలు డ్రైవర్ల కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించాలని అనుకుంటున్నాయి. ఆ విధానం దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరతాం అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. డ్రైవర్ల జీవన ప్రమాణ స్థాయి పెంచేందుకు కృషి చేస్తామని రాహుల్ గాంధీ భరోసానిచ్చారు. ప్రతిపక్ష నేత హామీతో క్యాబ్ డ్రైవర్ల ఒకింత సంతోషంగా ఉన్నారు.

## కాశ్మీర్‌లో ఉగ్రవాదుల మెరుపుదాడి

సీఆర్పీఎఫ్ బెటాలియన్.. సోమవారం ఆ ప్రాంతానికి చేరుకుంది. ఈ విషయాన్ని పసిగట్టిన ఉగ్రవాదులు.. సీఆర్పీఎఫ్ బృందంపై మెరుపు దాడికి దిగారు. మరోవైపు ఈ ఏడాది జూన్ నుంచి జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద దాడుల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఈ దాడుల్లో పలువురు భారత సైన్యానికి చెందిన అధికారులే కాక.. జమ్మూ కశ్మీర్ పోలీసులు సైతం భారీ సంఖ్యలో మరణించారు. ఈ దాడులకు తామే బాధ్యులమంటూ ఇప్పటికే పాకిస్థాన్‌కు చెందిన జై షే మహమ్మద్ జేబు సంస్థ కాశ్మీర్ టైగర్ ప్రకటించిన విషయం విధితమే. ఇక జులై 8వ తేదీ కతువా జిల్లాలో ఆర్మీ కాన్వాయిపై ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు ఆర్మీ సిబ్బంది మరణించారు. అలాగే జులై 6వ తేదీ కుల్గాం జిల్లాలో రెండు వేర్వేరు ఉగ్రవాద దాడుల్లో ఆరుగురు తీవ్రవాదులు మృతి చెందగా, ఇద్దరు సైనికులు సైతం మృతి చెందారు. రాష్ట్రంలో ఉగ్రవాద దాడులు మరింత పెరగడంతో.. వాటిని అణిచివేసేందుకు మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. అందులోభాగంగా రాష్ట్రంలో ఉగ్రవాద దాడుల నిర్మూలనకు కఠిన చర్యలు అవలంభించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే ఆ రాష్ట్ర ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికల నగారా మోగింది. దీంతో బీజేపీ కీలక నేతలు ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే ఇండియా కూటమిలోని కీలక నేతలు రాహుల్, ప్రియాంక తదితరులు సైతం ఆ రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు. అలాంటి వేళ.. ఎక్కడ ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రత చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలుస్తుంది.

## ప్రధాని మోడీకి రాఖీ కట్టిన చిన్నారులు

తన అధికారిక నివాసంలో పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి రక్షా బంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలికలతో ప్రధాని మోడీ ప్రత్యేకంగా మాట్లాడారు.. వారితో కలిసి సరదాగా పండుగను జరుపుకున్నారు. ప్రధాని మోడీకి చిన్నారులు రంగు రంగుల రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా ప్రధాని మోడీ.. రాఖీ వేడుకలకు సంబంధించిన చిత్రాలను, వీడియోలను ఎక్స్ లో షేర్ చేశారు.. తన యువ స్నేహితులతో కలిసి రక్షా బంధన్‌ని జరుపుకున్నందుకు సంతోషంగా ఉందంటూ.. ప్రధాని మోడీ ఎక్స్ లో పోస్ట్ చేశారు.



## ఈఎస్ఐ వ్యవస్థని భ్రష్టు పట్టించిన జగన్

### కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

విజయవాడ,ఆగస్ట్19 (ప్రజా మంటలు): ఈఎస్ఐ హాస్పిటల్ వ్యవస్థని గత ఐదేళ్లలో వైసీపీ భ్రష్టు పట్టించిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. ఈఎస్ఐ హాస్పిటల్ ప్రాంగణంలో ఉన్న 100పడకల హాస్పిటల్ భవనాన్ని, ల్యాబ్స్, డయోగ్నస్టిక్,సెంటర్లని మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం నాడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్గదె రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి , ధనుంజయ రెడ్డి కనుసన్నల్లో గత ప్రభుత్వంలో మొత్తం వ్యవస్థను నడిపించారని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపణలు చేశారు. గత ఐదేళ్లలో ఈఎస్ఐ హాస్పిటల్స్ జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ జరుగుతుందని హెచ్చరించారు. దళారీ వ్యవస్థ కారణంగా భారీ స్థాయిలో కుంభకోణాలు జరిగాయని విమర్శలు చేశారు. వైఎస్సార్ బీమాలో జరిగిన అవినీతిపైన విచారణ జరిపిస్తామని వార్నింగ్ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకుల మీద కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారని మంత్రి వాసంశెట్టి సుభాష్ గుర్తుచేశారు. చంద్రబాబుతో సహా అందరూ కడిగిన ముత్యం లాగా బయటకు వచ్చారని చెప్పారు. మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తను చేసిన అవినీతి ఎక్కడ బయటపడుతుందో అని భయపడి అసెంబ్లీకి రావడం లేదని అన్నారు. జగన్‌కి ఆ 10 స్థానాలు కూడా ఉండవని తేల్చిచెప్పారు. చివరికి ఆ పార్టీలో మిగిలేది జగన్ ఒక్కడేనని మంత్రి వాసంశెట్టి సుభాష్ విమర్శలు చేశారు.

## పాముకాటుతో డ్రైవర్ మృతి

హైదరాబాద్,ఆగస్ట్19(ప్రజా మంటలు): పెద్దపల్లి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పాము కాటుకు గురై ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన శాతరాజుల సతీష్ (39) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా, ఆదివారం రాత్రి కిరాణం షాప్‌కు వెళ్లి వస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సతీష్ మృతితో పాలకుర్తిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## తిరుమలలోవిజిలెన్స్ అధికారుల తనిఖీలు

### నకిలీ రూ.300 ప్రత్యేక దర్శన టికెట్లు స్వాధీనం

తిరుమల,ఆగస్ట్19 (ప్రజా మంటలు): తిరుమలలో నకిలీ రూ.300 ప్రత్యేక దర్శన టికెట్లను తితిదే విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కలర్ జిరాక్స్ టికెట్లతో వెళ్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వైకుంఠంలోని స్కానింగ్ చేసే దగ్గర రుద్రసాగర్ అనే వ్యక్తి చొరవతో నకిలీ టికెట్లతో కొందరు భక్తులు దర్శనం క్యూలోకి వెళ్లారు. విజిలెన్స్ అధికారులు పసిగట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. అమృత్ యాదవ్ అనే పాతనేరస్థుడు చెన్నైకి చెందిన మోహన్‌రాజ్ అనే వ్యక్తిని మోసం చేసి 4 టికెట్లకు గానూ రూ.11వేలు వసూలు చేశాడు. ఆ మొత్తాన్ని రుద్రసాగర్‌తో కలిసి పంచుకున్నట్లు సమాచారం. నకిలీ టికెట్ల వ్యవహారంలో పలువురు ఏపీ టూరిజం, తితిదే కార్పొరేషన్ అధికారుల హస్తమున్నట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎపిలో అల్లర్లు ..అరాచకాల పాలన

### రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది

### మాజీ ఎంపి మార్గాని భరత్ విమర్శలు

అమరావతి,ఆగస్ట్19(ప్రజా మంటలు): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడు నెలల పాలనలో అల్లర్లు, అరాచకాలు తప్ప మరేమీ జరగడం లేదని మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగమే రాష్ట్రంలో నడుస్తోందన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ..మదనపల్లిలో చంద్రన్న ఫైల్స్ మొదలుపెట్టారని.. సూపర్ సిక్స్ హామీలను పక్కనపెట్టడానికి ఈ వ్యవహారం స్టార్ట్ చేశారని విమర్శించారు. హెలికాప్టర్‌లో డీజీపీని సీఐడీ చీఫ్‌ని పంపించి ఆ కేసును ఏం చేశారని ప్రశ్నించారు. అంత హడావుడి చేసి ఏం తేల్చారని అడిగారు. పోలవరంలో కూడా డయాఫ్రం వాల్ చంద్రబాబు వల్ల దెబ్బ తిన్నదని నిపుణులు తేల్చి చెప్పారన్నారు. కాపర్ డ్యాంల నిర్మాణం పూర్తి కాకుండా డయాఫ్రం వాల్ కట్టటం వల్ల నష్టం జరిగిందని.. దాని గురించి చర్చ జరుగుతుండగా ధవళేశ్వరం ÷ల్స్ అని హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంలో ఎవరు ఉన్నారని నిలదీశారు. అమాయకులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని... వాస్తవాలను బయటకు తీయాలన్నారు. కరకట్ట ÷ల్స్ అని ఇంకో కథ నడిపారన్నారు. సూపర్ సిక్స్ పథకాల ఇష్యూ డైవర్షన్ కోసం కొత్త కథలు అల్లుతున్నారని వ్యాఖ్యలు చేశారు. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం, చంద్రబాబు చంద్రన్న ÷ల్స్ నడుపుతున్నారంటూ విరుచుకు పడ్డారు.వళేశ్వరం ÷ల్స్ అన్నీ జిరాక్స్ కాపీలు, వేస్టు పేపర్లు అని ఆర్డీవోనే చెప్పారని... మరి ఆ ÷ళ్లై దగ్గానికి, వైసీపీకి ఏం సంబంధమని నిలదీశారు. ప్రజలను ఎల్లవేళలా అబద్దాలతో నమ్మించలేరన్నారు. శ్రీసిటీలో ఆల్రెడీ ప్రారంభమైన పరిశ్రమలను చంద్రబాబు ప్రారంభిస్తున్నారని తెలిపారు. రెండు నెలల్లోనే పరిశ్రమలు వచ్చినట్టు జనాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. జగన్ హయాంలో శంకుస్థాపన చేసి, ప్రారంభం కూడా అయిన వాటిని చంద్రబాబు మళ్ళీ ప్రారంభించటం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీలాగా మా ప్రభుత్వం ప్రచారాలు చేసుకోలేదు. ప్రజల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేయకుండా సంక్షేమ పథకాలను అమలు చేయాలి' అని మాజీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు.

## అనుమతిలేని హాస్టళ్లపై కఠిన చర్యలు

### అనకాపల్లి ఘటనతో హోంమంత్రి ప్రకటన

విశాఖపట్నం,ఆగస్ట్19(ప్రజా మంటలు): అనకాపల్లి జిల్లా కోటవురట్ల హాస్టల్‌లో ముగ్గురు మృతి చెందిన ఘటనపై హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా దీనిని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. హాస్టల్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కేవలం కోటవురట్ల హాస్టల్ మాత్రమే కాకుండా రాష్ట్రంలో అనుమతి లేకుండా నడుస్తున్న అన్ని హాస్టల్స్‌పైనా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.సాధారణంగా ప్రభుత్వ అనుమతి ఉన్న హాస్టల్స్‌లో బయటి ఆహారపదార్థాలను అనుమతించబోరని, కానీ.. కోటవురట్ల హాస్టల్‌లో బయటి నుంచి ఎవరో తెచ్చిన ఆహారం తినడం వల్లే చిన్నారులు అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. కైలాస పట్టణంలోని హాస్టల్‌లో సమోసాలు తిని 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. వీరిలో సోమవారం ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మిగతావారిని నర్సీపట్నం, అనకాపల్లి ఏరియా ఆస్పత్రులతోపాటు, విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు.

## వరదల నివారణ లక్ష్యంగా ప్రాజక్టులు

### వరదలప్రాంతాలపై అధ్యయనం చేపట్టాలి

రాజమండ్రి,ఆగస్ట్19(ప్రజా మంటలు): ధవళేశ్వరం ఆనకట్ట కట్టడానికి ముందు ఆ ప్రాంతంలో తరచు గోదావరి నదికి వరదలు వచ్చేవి. తుపాన్లు గోదావరి జిల్లాల ప్రాంతంలో బీభత్సం సృష్టించేవి. సర్‌ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించడం ద్వారా ఆ ప్రాంతంలో విపత్తును నివారించగలిగారు. హైదరాబాద్ నగరంలో 1908లో వచ్చిన మూసీ వరదల తరువాత, అప్పటి నిజాం పాలకుడు, హైదరాబాద్‌కు శాశ్వత వరద నివారణ వ్యవస్థను, మంచినీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేశారు. పాలకుల దూరదృష్టికి ఇవి ఉదాహరణలు. ఇప్పుడు కూడా అనేక ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు. అయితే వరదలను, విపత్తులను దృష్టిలో పెట్టుకుని నిర్మించడంతో పాటు, చెరువులను పునరుద్ధరించాలి. పెరుగుతున్న పట్టణీకరణ కారణంగా చెరువులను, కాలువలను మింగేస్తున్నారు. తెలంగాణలో నీటి పారుదల ప్రణాళికను ఇప్పుడిప్పుడే ఆధునీ కరిస్తున్నారు. నదులను, చెరువులను సంధానం చేయాలన్న వ్యూహంతో సాగుతున్నారు. ఎపిలో కూడా సిఎం చంద్రబాబు నాయుడు నీటిపారుదల రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే వరదలను నివారించేలా కాటన్ స్ఫూర్తిని ప్రదర్శిస్తే మంచిది. ఈ దశలో శాశ్వత చర్యలతో పాటు తాత్కాలికంగా నష్టపోయిన వారిని ఆదుకోవాల్సి ఉంది. అలాగే అన్నదాతలకు పరిహారం అందేలా చేయాలి. అప్పుడే మళ్లీ వారు వ్యవసాయంలోకి దిగాలన్న భరోసాతో ఉంటారు. పంటలు నష్టపోయిన వారిని ఉదారంగా ఆదుకుంటేనే మనకు భవిష్యత్‌తో మళ్లీ అన్నం పెట్టగలరు. అలాగే వరదలకు కారణమైన ఆక్రమణల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాల్సి ఉంది. వరదలకు వ్యాధులకు ఉన్న సంబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. విషజ్వరాలతో పాటు అతిసార వంటి వ్యాధులు విజృంభించాయి. పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, దోమలు పెరగడం, మంచినీరు అందుబాటులో లేకపోవడం ఈ పరిస్థితికి కారణం. ఈ పరిస్థితులు కొనసాగుతుండగానే మరోసారి గోదావరి విరుచుకుపడుతోంది. ఏటా వర్షాకాలంలో పరీవాహక ప్రాంతాలు వరద ముంపు ముప్పును ఎదుర్కొంటున్నారు. పోలవరం ముంపు ప్రాంతాల్లో ప్రజానీకం మళ్లీ రక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నట్లు వార్తలు వచ్చాయి. ఇలా తరలివెళ్తున్న వారిలో అనారోగ్యానికి గురైన వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. అరకొరగా నిధులు కేటాయించడం, అవసరాలకు తగ్గట్టుగా సిబ్బందిని పెంచకపోవడం, అవసరమైన మందులను సరఫరా చేయకపోవడంతో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ముంపు ప్రాంతాల ప్రజలకు రక్షిత మంచినీటిని అందించడంతో పాటు, ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని సరఫరా చేయాలి. వరద పీడిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలి. పభుత్వాస్పత్రుల్లో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి.

## శ్రీవారి ఆలయంలో వైభవంగా శ్రావణ ఉపకర్మ

తిరుమల,ఆగస్ట్19(ప్రజా మంటలు): తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రావణ ఉపకర్మ వైభవంగా జరిగింది.ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు శ్రీ కృష్ణస్వామివారిని భూవరహస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు,, పసుపు, చందనంలతో అభిషేకించారు. అనంతరం స్వామివారికి నూతన యజ్ఞోపవీతాన్ని సమర్పించి, ఆస్థానం నిర్వహించారు. అనంతరం స్వామివారు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ పేష్కర్ శ్రీ శ్రీహరి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రక్షాబంధన్‌కు పలుచోట్ల ఆధారాలు

### పౌర్ణమిని నూలి పున్నమిగా గుర్తింపు

తిరుమల,ఆగస్ట్19(ప్రజా మంటలు): శ్రావణమాసంలో అనేక పర్వదినాలు వస్తుంటాయి. విష్ణుమూర్తి జన్మనక్షత్రం శ్రవణం. ఈ నక్షత్రం చంద్రునితో కూడిన మాసం కావడంతో శ్రావణమాసం అంటారు. ఈ మాసంలో వర్షాలు ఎక్కువగా కురుస్తాయి. ఆకాశం మబ్బులతో వెండికొండలను తలపిస్తుంటుంది. పూర్వకాలం వేద అధ్యయనం శ్రావణమాసంలోనే ప్రారంభమయ్యేది. విష్ణుత్‌పురాణంలో రక్షాబంధన్ గురించి వివరించారు. బలి చక్రవర్తిని విష్ణుమూర్తి దేవతల కోరిక మేరకు బంధిస్తాడు. అయితే ఈ బంధం అతనికి రక్షణగా

నిలుస్తుందని వరమిచ్చినట్టు తెలుస్తోంది. పాల్కురికి సోమనాథుడు ఈ పౌర్ణమిని నూలి పున్నమిగా అభివర్ణించాడు. కర్ణాటకలో నారికేళ పున్నమిగా పండగ నిర్వహిస్తారు. శ్రావణ పూర్ణిమను భారతదేశమంతా స్థానిక సంప్రదాయాల నేపథ్యంలో వేడుకగా నిర్వహిస్తుంటారు. నార్లీ పండగ, నూలి పున్నమి ఇలా రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. భారతావనిలో శ్రావణ పౌర్ణమిని పర్వదినంగా పాటించడం వేదకాలం నుంచీ ఉంది. వేదాధ్యయనం చేసేవారు ఉపాకర్మ అనే పేరుతో శ్రావణ పౌర్ణమి రోజున విశేష కార్యాలను నిర్వర్తిస్తుం దేవారు. వారి నియమాలలో ఒకటైన యజ్ఞోపవీతధారణకు ఈ రోజున ప్రాధాన్యాన్ని ఇస్తుండేవారు. ఉపనయనం అనే విధి సంస్కారం దీనికి ఆధారంగా ఉండేది. యజ్ఞోపవీతాన్నే యజ్ఞ సూత్రం అని కూడా అంటారు. ఈ పౌర్ణమినాడు మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో సముద్రతీర వాసులు సముద్రం దగ్గరకు వెళ్లి సముద్రుడిని పూజించి కొబ్బరికాయలను కొడతారు. అందుకే దాన్ని నార్లీ పౌర్ణమి అనిపిలుస్తారు. వేదకాలంలో ఇది సాక్షాత్తు విష్ణుశక్తి స్వరూపంగా ఉన్నట్లు తెలుస్తోంది. రక్షా బంధాన్ని ఇప్పట్లోలా సోదరి, సోదరుడికి కట్టడమనేది తొలిరోజుల్లో ఉండేది కాదు. భర్త చేతికి భార్య కట్టేది. శత్రు జయాన్ని కలిగిస్తాయన్న నమ్మకంతో ఆవాలు, అక్షతలను వేసి పొట్లం కట్టేవారు. ఆవాలు, అక్షితలను రక్షాద్రవ్యం అనేవారు. ఈ రక్షాద్రవ్యాలున్న పొట్లాన్ని ఒక పరిశుభ్రమైన వస్త్రంలో ఉంచి మూటకట్టేవారు. దాన్ని పీఠంపై ఉంచి పూజించిన తర్వాత దాన్ని పురోహితుడితో చేతికి కట్టించుకునేవారు. పూజ చేసిన ఆ పొట్లం విష్ణుశక్తికి ప్రతిరూపమని నమ్మకం. ఆరోజుల్లో రాక్షసులకు, దేవతలకు చాలాకాలం యుద్ధం జరిగింది. రోజురోజుకూ దేవతల శక్తి సన్నగిల్లడం చూసిన ఇంద్రుని భార్య శచీదేవి శ్రావణ పౌర్ణమి నాడు విధివిధానంగా రక్షను రూపొందించి విష్ణుశక్తి స్వరూపమైన ఆ రక్ష మహిమను, శ్రావణ పౌర్ణమి విశేషాలను వివరించి దాన్ని ఇంద్రుడి చేతికి కట్టింది.

## చంద్రబాబు నివాసంలో రాఖీ వేడుకలు

### రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు

అమరావతి,ఆగస్ట్19(ప్రజా మంటలు): రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా పలువురు మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. పలువురు సీనీ, రాజకీయ ప్రముఖులు కూడా కుటుంబాలతో కలిసి ఈ వేడుకలను జరుపుకున్నారు. కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాలముఖ్యమంత్రులు, ముఖ్య నేతల ఇళ్ల దగ్గర వారికి రాఖీలు కట్టేందుకు మహిళలు పోటీ పడ్డారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఇంటి వద్దకు కూడా ఆయనకు రాఖీలు కట్టేందుకు పలువురు మహిళలు వచ్చారు. దాంతో ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం సందడిసందడిగా మారింది. పలువురు మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు ఆయనకు రాఖీలు కట్టారు. చంద్రబాబుకు మహిళలు రాఖీలు కట్టి అభిమానం చాటుకున్నారు.

# సోషలిస్టు వాస్తవికత'- జీవితం ఎలా వుందో చెప్పడంతో పాటు, ఎలా ఉంటే బాగుంటుందో కూడా చిత్రించాలి..




## - సామాజిక తత్వవేత్త బి ఎస్ రాములు

- దూళిపాళ అరుణ, రచయిత్రి
8712342323

(నిన్నటి సంచిక తరువాయి)

**(ప్రసిద్ధ కథకులు, నవలాకారులు, సాహిత్య విమర్శకులు, సామాజిక తత్వవేత్త బి.ఎస్. రాములు గారి 75వ జన్మదిన వజ్రోత్సవ సందర్భంగా బి.ఎస్.రాములుగారితో ప్రత్యేక ముఖాముఖి)**

అసలు గొల్లపూడి నన్ను ఇంటర్వ్యూ చేయరనుకున్నాను. మేము తెలంగాణ తల్లి గురించి కొట్లాడుతున్న రోజులు. ఆయనేమో తెలంగాణ తల్లి ఉంటుందా? అంటూ విమర్శ వ్యాసం రాసిన వ్యక్తి (నవ్వుతూ). కలిసి మాట్లాడిన తర్వాత ఎంతో ఆత్మీయంగా మాట్లాడారు. నా ఆలోచనా దృక్పథం ఆయనకు అర్థమైంది. “ఈ పుస్తకాన్ని గొప్పగా తీర్చిదిద్దాలనుకుంటున్నాను. సహకరిస్తారా? అని కూడా అడిగారు. ఎంతో సంతోషం కలిగింది. 'వందేళ్ల కథ' గొప్ప పేరు తెచ్చుకుంది. గొప్ప క్లాసిక్ అది. అటువంటి వాటిల్లో చరిత్ర, సాహిత్యం, సంస్కృతి ఉంటాయి. ఆంధ్రజ్యోతి పత్రిక వాళ్ళు వేసిన ఇట్లాంటి పుస్తకం మరొకటి కూడా గొప్ప పేరును పొందింది. అలాగే వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో 1990 నుండి వెలువరించిన కథా సంకలనాలను రెండు సంపుటాలుగా పునర్ముద్రించారు. అందులో మెరుగు అనే కథ చేర్చుకున్నారు. చీకోలు సుందరయ్యగారు 'నిచ్చెన' కథాసంకలనంలో పాలు కథ తీసుకున్నారు. దళిత కథలు ఎనిమిది సంకలనాలు తెచ్చిన డా. కె. లక్ష్మి నారాయణ 'బందీ' కథ మొదలుకొని అనేక కథలను సంకలనంలో చేర్చారు. నేను, వనమాల చంద్ర శేఖర్ సంపాదకత్వంలో వెలువరించిన కరీంనగర్ జిల్లా కథలు నాలుగు సంపుటాల్లోను 'భారతీయ సాహిత్యం- తెలుగు కథలు' అనే సంకలనం లోను మరికొన్ని కథలను చేర్చడం జరిగింది. ఇలా ఆయా సంకలనాల్లో సామాజిక చరిత్ర పరిణామాలను విస్తృతంగా ప్రతిఫలించే కథలను సూచించడం జరిగింది. ఇంకా అనేక సంకలనాల్లో కథలు చేర్చుకోబడ్డాయి. 'కథాసాగర్' సంకలనంలో 'సదువు' కథను చేర్చారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారి సంకలనంలో 'అడవిలో వెన్నెల' కథ చేర్చారు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ అచ్చువేసిన కథా సంకలనాల్లో 'అడవిలో వెన్నెల' కథ మొదటిసారిగా అచ్చు వేశారు. తర్వాత అనేక సంకలనాల్లో దీన్ని చేర్చారు. కేంద్ర సాహిత్య అకాడమీ తరఫున ప్రచురించే ఇండియన్ లిటరేచర్ అనే పత్రికలో 'రియల్ ఎస్టేట్' అనే కథను ఎంపిక చేసి ప్రచురించారు.

**19. మీ కథా వస్తువు శైలీ శిల్పం లోని ప్రత్యేకతను, పరిణామ క్రమాన్ని వివరించండి.**

జ :- నా కథా వస్తువులో కాలానుగుణంగా చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. నా కథలపై 6 ఎమ్ ఫిల్స్, 2 పి హెచ్ డి లు వచ్చాయి. దాంట్లో కథల గురించే కాక కాలక్రమానుగతమైన దశల గురించి, శిల్పంలో క్రమేణా వచ్చిన దశల గురించి వివరించారు. అట్లాగే నా సాహిత్యం మీద ఒక సెమినార్ జరిగింది. వాటన్నిటి సారాంశం %ొ%.ఇలా చెప్పుకోవచ్చు.

1.1977 నుండి ప్రారంభదశ, 2. 1980- 1990 విప్లవ సాహిత్యం 3.1990-1995 బహుజన సాహిత్యం 4. 1996-2000 మానవ సమాజ పరిణామం 5. 2001-2005 తెలంగాణ ఉద్యమ ప్రాధాన్యత 2006 నుండి పై అన్ని దశల పరిణామాలు, విశ్లేషణ, సామాజిక పరివర్తన చిత్రణ.

ఇలా కథల వస్తువుల్లో శైలీశిల్పంలో అనేక మార్పులు జరిగాయి. మొదటగా జీవితంలో కష్టాలు, కన్నీళ్ళ గురించి రాశాను. 1980-90 వరకు రాసిన కథలన్నీ విప్లవానికి సంబంధించినవి. అన్యాయానికి, అణచివేతకు గురవుతున్న వారి గురించి రాశాను. విప్లవ సంఘాలు, నక్సలైట్లు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యమకారులు, పౌరహక్కుల సంఘాలు, బిసి,ఎస్సీ,ఎస్టీలు ఇలా అనేక విభాగాలకు సంబంధించిన వారి గురించి రాశాను. విప్లవ కథలతో 1991లో 'పాలు' కథల సంపుటి వెలువడింది. ఇది ఆంధ్ర యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీలలో ఎమ్ ఏ విద్యార్థులకు పాఠ్య గ్రంథం. ఆతర్వాత మరికొన్ని కథలు కలిపి 'ఇతర కథలు' సంపుటి తెచ్చాను. అలాగే విప్లవ కథలతో 2004 లో 'తేనెటీగలు' కథల సంపుటి వేశాను.

ఆ తర్వాత 2013లో అంతదాకా దొరకని కథలు సేకరించి 'అడవిలో వెన్నెల' కథా సంపుటి వేయడం జరిగింది. ఇందులో మారుతున్న విప్లవం పట్ల మారిన నా భిన్నమైన అభిప్రాయాలతో ముందుమాట రాశాను. 'ఉద్యమం ఉద్యమం కోసం కాదు. జీవితం గెలవడం కోసం' అని కథలు రాశాను. విద్య యొక్క ప్రాధాన్యత, విద్యావ్యవస్థ తీరు, కుటుంబ వ్యవస్థ పరిణామాలు, ప్రాజెక్టులు తెచ్చిన పరిణామాలు, అభివృద్ధి తెచ్చిన పరిణామాలు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, వాటి పరిణామాలు మొదలైనవి కథల్లో నవలల్లో చిత్రించాను. కథల్లో జీవితంలో గెలుచుకున్న విధానాన్ని చూపించాలి కానీ ఓడినట్లు చూపించొద్దని నా అభిప్రాయం. మొదటినుండీ వివక్ష ఎలా ఉంది? దానిని ఏ విధంగా దూరం చేయాలి? సమసమాజ నిర్మాణానికి ఏం చేయాలి? ఇదీ కథల్లో చూపించాల్సింది. దీన్ని 'సోషలిస్టు వాస్తవికత' అంటారు. అనగా జీవితం ఎలా వుందో చెప్పడంతో పాటు, ఎలా ఉంటే బాగుంటుందో కూడా చిత్రించాలి. ఏం జరిగింది? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? ఎక్కడ జరిగింది? ఆ పరిణామం ఎందుకు అనివార్యమైంది? అనే విషయాలు అన్ని కథల్లో చిత్రించగలిగితే ఆ కథా వస్తువు శైలీ శిల్పం ప్రారంభం, ముగింపు చక్కగా కుదిరితే అది గొప్ప కథ. ఇలాంటి కథలు క్లాసిక్స్ గా ప్రతిభాషలో ప్రపంచ సాహిత్యం లో కలకాలం నిలిచిపోతాయు. ఇదే విషయాన్ని 'కథలబడి' కథా సాహిత్యాలంకారంలో విశ్లేషించాను. నా కథల్లో వీలైన మేరకు వీటిని చిత్రించాను. ఆపిల్ ను కోసి ఎంత చిన్న ముక్క చేసినా దాని రుచి మారదు. అలాగే జీవితంలోంచి ఏ చిన్న అంశం తీసుకున్నా మొత్తం సామాజిక స్వరూప స్వభావాలు ఆపిల్ ముక్కలో ఉండే రుచిని చెప్పగలిగేటట్లు ఉండాలి. ఇదే విషయాన్ని నిర్వచించడానికి 'సమగ్ర సామాజిక కథ' అని పేరు పెట్టడం జరిగింది. 'సమగ్ర సామాజిక కథ 50 ఏళ్ల తెలుగు కథ తీరుతెన్నులు' పుస్తకాన్ని 2003 లో వెలువరించాను. 2004లో 'సాహిత్య చరిత్రను కొత్త చూపుతో తిరగ రాయాలి' అనే పుస్తకాన్ని ప్రచురించాను. ఇలా నేను కథల్లో, నవల అంత కథావస్తువును ఒక శైలీ శిల్పంతో కథలుగా మలిచాను. ఇదే మాటను విపుల, చతుర సంపాదకులు చలసాని ప్రసాద రావుగారు అడిగారు. మా తెలంగాణ కథలు, నవలలు అచ్చు వేయడానికి వివక్షతకు గురవుతున్నాయి. నిరంతర ఉద్యమాలతో చురుకైన పాత్ర నిర్వహించడం వల్ల సమయం సరిపోవడం లేదు. ఒకపేజీ కథ రాసుకొని రెండు గంటల సినిమా తీస్తున్నారు. వంద ఏపిసోళ్ల టివి సీరియల్ తీస్తున్నారు. ఈ నాలుగు కారణాల వల్ల కథ వస్తువు ఇతివృత్తం ఎంత విశాలమైనదైనప్పటికీ కథలుగా, కథానికలు గా మలిచాను. ఇదే నా కథలోని కథా వస్తువు, శైలీ శిల్పం, ప్రెజెంటేషన్ ప్రత్యేకత. యువ రచయితలు పరిణతి పొందే క్రమంలో ఈ దశకు తప్పనిసరిగా ఎదగాలి. 1968 లో అచ్చయిన 'జగిత్యాల కథ' కూడా ఒక మొత్తం సమాజ పరిణామాన్ని కుటుంబ సంబంధాలను ఉమ్మడి కుటుంబం, వ్యక్తి కుటుంబసలుగా విడిపోతున్న తీరును చిత్రించిన కథే. అందుకే అలాంటి మార్పు కోసం నా కథలను కూడా దశలవారీగా, పరిస్థితులకు అనుగుణంగా మార్పు చేసుకుంటూ చైతన్యాన్ని కలిగించేలా రాశాను.

**20. మీ కథా కథనాన్ని విశ్లేషిస్తూ విహారి గారు రచించిన 'నవ్య కథాశిల్పి- బిఎస్ రాములు' పుస్తకంలోని విశేషాలు ఏవి?**

జ :- కథా వస్తువు ఎవరిది? ఆ పాత్రలు, సంఘటనలు ఎవరివి? ఎవరి జీవితం గురించి రాశారు? వీటిని వివరిస్తూ 'నవ్య కథా శిల్పి-బిఎస్ రాములు' అని సుప్రసిద్ధ సాహితీ వేత్త విహారి గారు ఎంతో ప్రేమతో ఆ పుస్తకం రాశారు. కాలం తెచ్చిన మార్పు, గెలుచుకున్న జీవితం, చికాగోలో నానమ్మ అనే మూడు కథా సంపుటాలను తమ పరిశీలనకు తీసుకున్నారు. ఆ కథల్లో ఏ ఏ వృత్తులున్నాయో వాటిని చిత్రించారు. మహిళల పట్ల, విద్యార్థుల పట్ల, బిసి ల పట్ల, చేతి వృత్తుల పట్ల సహానుభూతితో జీవితాలను, సంస్కృతిని చిత్రించారని ప్రతి కథ గురించి చక్కగా విశ్లేషించారు. అది ఒక రకంగా ఎమ్ ఫిల్, పి హెచ్ డి సిద్ధాంత గ్రంథంతో సమానమైనది. వారు విశ్లేషించిన తీరు, పరిణతి అనితరసాధ్యం . కథలు రాయడం నేర్చుకున్న తర్వాత మంచి కథలు రాయడానికి, గొప్ప కథలు రాయడానికి ఈ పుస్తకం తప్పక చదవాలి. అసలు అలాంటి వారికోసమే ఈ పుస్తకం విహారి గారు రాసినట్టున్నారు. నేను 'కథలబడి' లో కథారచనకు కథకుడి పాఠాలు అనే అలంకార శాస్త్రాలలో చెప్పిన అంశాలు, విశ్లేషణలు వీటి తరువాత ఇంకేం చెప్పాలో? ఇంకేం చదవాలో? అనే పరిశీలనా విశ్లేషణ విహారి గారు అందించారు.

(మిగిలిన ఇంటర్వ్యూ రేపు కొనసాగుతుంది)

# రిజర్వేషన్లపై రాహుల్ వ్యాఖ్యలు



**అవగాహన లేదని ఖ్యలని కొట్టిపారవేత**

**ఘాటుగా స్పందించిన కేంద్రమంత్రి మేఘవాల్**

న్యూఢిల్లీ,ఆగస్ట్19 (ప్రజా మంటలు): లేటరల్ ఎంట్రీ ద్వారా రిజర్వేషన్లకు మోదీ సర్కార్ తూట్లు పొడుస్తున్నదని విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో విపక్ష నేతని, ఆయన రాజ్యాంగ పదవిలో ఉన్నారని, బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం ఆయనకు తగదని ఆక్షేపించారు. లేటరల్ ఎంట్రీ ద్వారా ఆరెస్సెస్ వ్యక్తులను ఉన్నత పదవుల్లో నియమిస్తారని రాహుల్ గాంధీ చెప్పడం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ సైతం లేటరల్ ఎంట్రీలో భాగమేనని గుర్తుచేశారు. 1976లో మీరు ఆయనను నేరుగా ఫైనాన్షియల్ సెక్రటరీగా ఎలా నియమించారని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. మీ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ కూడా లేటరల్ ఎంట్రీలో భాగమేనని అన్నారు. ఇలాంటి వందలాది ఉదాహరణలు కనిపిస్తాయని, లేటరల్ ఎంట్రీని తీసుకొచ్చిందే మీరని రాహుల్‌ను ఉద్దేశించి కేంద్ర మంత్రి పేర్కొన్నారు. లేటరల్ ఎంట్రీని మీరు ప్రారంభిస్తే దాన్ని మోదీ క్రమబద్ధీకరణ చేశారని చెప్పారు. 2005లో పరిపాలనా సంస్కరణల కమిషన్ ఏర్పాటైందని, దాని నివేదిక బయటకువచ్చిందని తెలిపారు. 2005 నుంచి యూపీఏ అధికారంలో ఉందని గుర్తుచేశారు. తాము రిజర్వేషన్లకు చరమగీతం పాడతామని చెబుతున్నారని, అసలు మీరు ఎప్పుడు నియామకాలు చేపట్టారని మీరు ఏం చేశారని కేంద్ర మంత్రి నిలదీశారు. కాంగ్రెస్‌కు హఠాత్తుగా ఓబీసీలపై ప్రేమ పెరిగిపోయిందని ఎద్దేవా చేశారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ స్వయంగా తాను ఓబీసీ రిజర్వేషన్‌కు వ్యతిరేకమని చెప్పారని, కానీ ఇప్పుడు కాంగ్రెస్‌కు ఓబీసీలపై ప్రేమ పుట్టుకొచ్చిందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులను కాంగ్రెస్ తప్పుదారిపట్టిస్తోందని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దుయ్యబట్టారు.

# ఏపీలో ఫాక్స్‌కాన్ భారీ పెట్టుబడులు

**మంత్రి నారా లోకేశ్‌తో ప్రతినిధి బృందం భేటీ**

**పెట్టుబడులకు సూత్రప్రాయ ఒప్పందం**



అమరావతి,ఆగస్ట్19 (ప్రజా మంటలు): ఏపీలో భారీగా పెట్టుబడులకు ఫాక్స్‌కాన్ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ప్రభుత్వం, సంస్థ ప్రతినిధులు మధ్య సూత్రప్రాయ ఒప్పందం జరిగింది. ఉండవల్లిలోని నివాసానికి వచ్చిన ఫాక్స్‌కాన్ బృందానికి లోకేశ్ స్వాగతం పలికారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలను మంత్రి లోకేశ్ వారికి వివరించారు. త్వరలోనే దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఈవీ, ఎలక్ట్రానిక్ పాలసీలు తీసుకురాబోతున్నట్లు వెల్లడించారు. ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పరిశ్రమలకు రాయితీలు కల్పించే విధానం కూడా రూపొందిస్తున్నామని చెప్పారు. ఏపీలో ఫాక్స్‌కాన్ మెగా మ్యానుఫ్యాక్చరింగ్ సిటీ నిర్మాణం చేయాలని కంపెనీ ప్రతినిధులను లోకేశ్ కోరారు. ఏపీలో ఎలక్ట్రానిక్ వాహనాలు, సెమీ కండక్టర్లు, డిజిటల్ హెల్త్, మ్యానుఫ్యాక్చరింగ్ కంపోనెంట్స్ తయారీకి సంబంధించిన ఎ÷-లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ తెలిపింది. సీఎం చంద్రబాబు చొరవతో 2014 నుండి 2019 వరకు ఏపీకి వచ్చిన అనేక కంపెనీల్లో ఫాక్స్‌కాన్ కూడా ఒకటని లోకేశ్ గుర్తు చేశారు. ఈ సంస్థ నిర్మించే మెగా సిటీ ఏర్పాటుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ప్రజాప్రభుత్వంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ లక్ష్య సాధనలో ఫాక్స్‌కాన్ ప్రధాన భూమిక పోషించాలని మంత్రి ఆకాంక్షించారు. అనుమతుల నుండి ఉత్పత్తి వరకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# 23న గ్రామసభల నిర్వహణ



**ఉపాధిహామీ పథకం పనులపై కార్యాచరణ**

**అధికారులకు డిప్యూటీ సిఎం పవన్ ఆదేశాలు**

అమరావతి,ఆగస్ట్19 (ప్రజా మంటలు): ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23వ తేదీన గ్రామ సభల నిర్వహణ చేపట్టాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. ఏపీ సచివాలయం నుంచి సోమవారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం గ్రామ సభ నిర్వహణ, అందుకు సంబంధించిన విధి విధానాలపై పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పథకం పరిధిలో 46 రకాలైన పనులు చేపట్టవచ్చని అన్నారు.ఈ పథకం ద్వారా రూ. వేల కోట్లు నిధులు వెచ్చిస్తున్నామని వివరించారు. ప్రతి రూపాయి బాధ్యతతో వ్యయం చేయాలని.. ఉపాధి హామీ పథకం లక్ష్యం అందుకోవాలని సూచించారు. జిల్లాస్థాయి అధికారుల నుంచి, మండల, గ్రామ స్థాయిలో ఉన్న అధికారులు ఈ పథకం పనులు అమల్లో బాధ్యత తీసుకోవాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. సోషల్ ఆడిట్ విభాగం పకడ్బందీగా వ్యవహరించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయం నుంచి పీఆర్, ఆర్డీ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, కమిషనర్ శ్రీ కృష్ణ తేజ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 26 జిల్లాల నుంచి జడ్పీ సీఈవోలు, డీపీఓలు, డ్వామా పీడీలు, మండలాల నుంచి ఎంపీడీఓలు, ఈవో పీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఏపీఓలు హాజరయ్యారు.

# రాష్ట్రంలో కరవు అనే మాట వినిపించకూడదు

**నీటిని పూర్తిగా వినియోగించుకునేలా ప్రణాళికలు**

**ఎపి సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశం**

నెల్లూరు,ఆగస్ట్19(ప్రజా మంటలు): రాష్ట్రంలో కరవు అనే మాట వినిపించకూడదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశానికే అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో.. ఇప్పుడు వ్యవసాయానికి గడ్డు పరిస్థితి వచ్చిందన్నారు. నెల్లూరు జిల్లా పర్యటనకు వెళ్లిన ఆయన.. సోమశిల ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉన్మాద, రాక్షస పాలన నుంచి బయటకు వచ్చామన్న ఆయన.. రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని అందరూ హాయిగా ఉన్నారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో బాధ్యత గుర్తెరిగి పని చేయాల్సిందే. రైతులకు నీళ్లు సకాలంలో ఇస్తే బంగారం పడిస్తారు. మొత్తం రిజర్వాయర్లలో 983 టీఎంసీలు నిల్వ చేసుకోవచ్చు. ఇప్పటి వరకు 692 టీఎంసీలు నిల్వ చేసుకున్నాం. 20 ఏళ్ల తర్వాత ఏపీలో ఆగస్టులోనే రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయి. వరుణ దేవుడు కూడా మనల్ని ఆశీర్వదిస్తున్నారు. 70శాతం ప్రాజెక్టుల్లో నీళ్లు వచ్చాయి. నీటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని చంద్రబాబు అన్నారు. డబ్బులివ్వకపోతే కాంట్రాక్టర్ పని చేస్తారా? గేటు పెట్టలేని ప్రభుత్వం ఐదేళ్లు పాలించింది. ప్రాధాన్యతలు తెలిసిన ప్రభుత్వమిది. కష్టాలున్నా.. ఖాళీ ఖజానా ఉన్నా.. ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత మాది. పాత రోజులు మరిచిపోవాలని అందరికీ చెబుతున్నా. బాధ్యతగా పని చేయాలి. సకాలంలో పనులు పూర్తి చేయాలి. గత ప్రభుత్వంలో సర్వే రాళ్లపై బొమ్మలకు రూ.700 కోట్లు ఖర్చుపెట్టారు. పేపర్లకు ప్రకటనల కోసం రూ.403 కోట్లు ఖర్చుపెట్టారు. ఈ డబ్బుల్లో రూ.200 కోట్లు ఖర్చు పెట్టినా కొన్ని ప్రాజెక్టులు పూర్తయ్యేవి. రుషికొండ కొట్టేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టించుకున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు.

# కెటిఆర్‌తో శ్రీలంక మంత్రి భేటీ

**బిఆర్ఎస్ హయాంలో అభివృద్ధిపై అభినందనలు**



హైదరాబాద్,ఆగస్ట్19(ప్రజా మంటలు): బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ని శ్రీలంక మంత్రి సదాశివం వియలేంద్రన్ ఆయన నివాసంలో కలిశారు. బిఆర్ఎస్ సర్కార్ హయాంలో రాష్ట్రాభివృద్ధిపై కెటిఆర్‌ను ఆయన అభినందించారు. బిఆర్ఎస్ పనితీరు తమకు స్ఫూర్తిగా నిలిచిందని సదాశివం అన్నారు. 'మీ పాలన మాకు ఆదర్శం. బిఆర్ఎస్ పదేళ్లలో అనూహ్య ప్రగతి సాధించింది. గతంలో శ్రీలంక పార్లమెంట్‌లోనూ ఈ విషయాన్ని నేను ప్రస్తావించా. హైదరాబాద్ అభివృద్ధి సింగపూర్‌ను తలపించేలా ఉంది. మాజీ సిఎం కేసీఆర్, కెటిఆర్ తెలంగాణను పెట్టుబడులకు కేరాఫ్‌గా మార్చా రు. ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరుగుతుంటే, రాష్టాన్ని అవకాశాల అక్షయపాత్రగా మార్చిన మీ తీరు మాకు స్ఫూర్తిదాయకం' అని సదాశివం వెల్లడించారు. సదాశివంతో సమావేశం అనంతరం కెటిఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన మాటలు బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన పనులను గుర్తు చేశాయన్నారు. 'తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిపై ఆయన నాతో సుదీర్ఘంగా చర్చించారు. పదేళ్ల అత్యల్ప కాలంలో రాష్ట్రం ఇంతగా పురోగమించడంపై గర్వంగా ఉంది. హైదరాబాద్‌ను అవకాశాల హబ్‌గా మార్చడంలో మా కృషిని గుర్తించినందుకు మంత్రి సదాశివంకు కృతజ్ఞతలు. దశాబ్ద కాలంలో బిఆర్ఎస్ పాలన ఎంత అంకితభావంతో సాగిందో మంత్రి సదాశివం నాతో పంచుకున్నారు. బిఆర్ఎస్ సంపద సృష్టించడమే కాకుండా, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలను ఆదుకున్న విషయాన్ని నేను ఆయనకి వివరించా'అని కెటిఆర్ తన పోస్ట్‌లో వెల్లడి చేశారు.

# ఎక్కడికెళ్లినా భూ సమస్యలపైనే ఫిర్యాదులు

**మంత్రి అచ్చెన్నాయడు వెల్లడి**

అమరావతి,ఆగస్ట్19 (ప్రజా మంటలు): గత ప్రభుత్వం వ్యవస్థలను నాశనం చేసిందని మంత్రి అచ్చెన్నాయడు ధ్వజమెత్తారు. భూరికార్డులను తారుమారు చేశారని మండిపడ్డారు. ఎక్కడ చూసినా భూ సమస్యలపైనే ఫిర్యాదులు వస్తున్నాయని, త్వరలోనే గ్రామాలకు రెవెన్యూ అధికారులను పంపి వాటిని గ్రామసభల్లో పెడతామని చెప్పారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. రవాణా శాఖలో దోపిడీ కోసం 5 జోన్లు ఏర్పాటు చేశారని ఆరోపించారు. వాటిపై విచారణ చేపడతామన్నారు. తప్పు చేసిన వాళ్లు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈ ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు ఉండబోవని స్పష్టం చేశారు.

## ఆలయాలకు శ్రావణశోభ
## గోదావరి తీరాల్లో భక్తుల సందడి

తిరుమల (ప్రజామంటలు): శ్రావణ మాసం సోమవారం సందర్భంగా గోదావరి తీరంలో భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చేయించారు. వేములవాడ మొదలుకుని ధర్మపురి, కాళేశ్వరం, బాసర తదితర క్షేత్రాలకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. కాళేశ్వరంలో గోదావరి స్నానాలు చేసిన భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు. ధర్మపురిలో కూడా గోదావరి స్నానాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గోదావరి కళకళలాడుతండడంతో ప్రజలు భారీగా తరలి వచ్చారు. బాసరలో కూడా అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేములవాడలో భారీగా భక్తులు తరలివచ్చారు. గుండంలో స్నానాలు ఆచరించి కోడె మొక్కులు తీర్చుకున్నారు. ఇకపోతే కోటిలింగాల గోదావరి తీరం భక్తులతో నిండిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ వాహనాల్లో అధిక సంఖ్యలో తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేశారు. ఆలయంలోని శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని ఏడుపాయల దుర్గామాత ఆలయం భక్తులతో సందడి నెలకొన్నది.

## వ్యాసకర్తలకు వినతి


**రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.**

mantalukathalu@gmail.com

-ఎడిటర్

# అత్యంత పిన్న వయసులో భారత ప్రధానిగా రాజీవ్

## దేశంలో నవతరం నాయకుడిగా గుర్తింపు - నేడు రాజీవ్ జయంతి



న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): 40 ఏళ్ళ వయసులో భారత యువ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్‌గాంధీ బహుశా ప్రపంచంలోనే అతి పిన్నవయస్కులైన ప్రభుత్వాధినేతల్లో ఒకరు కావచ్చు. 1984 అక్టోబర్ 31న తల్లి ఇందిరాగాంధీ దారుణ హత్యకు గురైన సమయంలో ప్రధానమంత్రిగాను, కాంగ్రెస్ అధ్యక్షునిగాను ఆయన నిర్వర్తించాల్సి వచ్చింది. వ్యక్తిగత దుఃఖాన్ని, విచారాన్ని అణచుకొని జాతీయ బాధ్యతను ఎంతో హుందాగా, ఓర్పుగా తన భుజాలకు ఎత్తుకున్నారు. నెల రోజులపాటు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రాజీవ్‌గాంధీ దేశంలోని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి అలుపు అలసట లేకుండా ప్రయాణించారు. అనేకచోట్ల 250 సభల్లో మాట్లాడారు. కోట్లాది మంది ప్రజలతో ముఖాముఖి జరిపారు. ఆధునిక భావాలు, నిర్ణయాత్మక శక్తి కలిగిన రాజీవ్‌గాంధీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. తన ప్రధాన ఆశయాలలో భారత ఐక్యతను పరిరక్షిస్తూనే దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకువెళ్ళడం ముఖ్యమైనదని రాజీవ్ పదేపదే చెబుతూండేవారు. దేశంలో తరం మార్పుకు సంకేతంగా రాజీవ్‌గాంధీ దేశ చరిత్రలోనే అతిపెద్ద మెజార్టీ సాధించారు. హత్యకు గురైన తన తల్లి అంత్యక్రియలు పూర్తికాగానే ఆయన లోక్‌సభ ఎన్నికలకు ఆదేశించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అంతకుముందు 7 సార్లు జరిగిన ఎన్నికలలో కంటే అత్యధిక ఓట్లను సాధించింది. లోక్‌సభ సీట్లలో రికార్డుస్థాయిలో 401 సీట్లు గెలుచుకుంది. కోట్ల మంది భారతీయులకు నాయకునిగా అటువంటి శుభారంభం చేయడం అది ఎటువంటి పరిస్థితి అయినా చెప్పుకోదగిందే. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే రాజీవ్‌గాంధీ పూర్తిగా రాజకీయ కుటుంబానికి చెందినవారు అయినప్పటికీ ఆలస్యంగా, అయిష్టంగా రాజకీయాల్లో ప్రవేశించి కూడా ఇంత పెద్ద మెజార్టీ సాధించడం, స్వాతంత్ర ఉద్యమంలోను, ఆ తరువాత 4 తరాలపాటు భారతదేశానికి సేవలు అందించిన రాజకీయ కుటుంబానికి చెందిన రాజీవ్‌గాంధీ అనివార్య పరిస్థితుల్లోనే రాజకీయ ప్రవేశం చేశారు. రాజీవ్‌గాంధీ 1944 ఆగస్టు 20 బోంబేలో జన్మించారు. భారతదేశం స్వాతంత్యం÷-ర సాధించేనాటికి ఆయన తాత ప్రధానమంత్రి అయ్యేనాటికి రాజీవ్ వయసు కేవలం 3 సంవత్సరాలు. ఆయన తల్లిదండ్రులు లక్నో నుంచి ఢిల్లీకి మకాం మార్చారు. తండ్రి ఫిరోజ్ గాంధీ పార్లమెంటు సభ్యుడు అయ్యారు. నిర్భయంగా కష్టపడి పనిచేసే పార్లమెంటేరియన్‌గా పేరు తెచ్చుకున్నారు. రాజీవ్‌గాంధీ తన బాల్యాన్ని తాతగారితో కలసి తీన్‌మూర్తి హౌస్‌లో గడిపారు. అక్కడ ఇంధిరాగాంధీ ప్రధానమంత్రి సహాయకురాలిగా పనిచేశారు. డెహ్రాడూన్‌లోని వెల్హామ్ ప్రెప్ స్కూల్‌కు కొద్దికాలంపాటు వెళ్ళిన రాజీవ్‌గాంధీ తరువాత రెసిడెన్షియల్ డూన్ స్కూల్‌కు మారారు. అక్కడ ఆయన అనేక మందితో ప్రగాఢ మైత్రిని పెంపొందించుకున్నారు. చిన్నతమ్ముడు సంజయ్‌గాంధీ కూడా ఆయనతో కలిశారు. స్కూల్ చదువు పూర్తయిన తరువాత రాజీవ్‌గాంధీ కేంబ్రిడ్జి ట్రినిటీ కళాశాలలో చేరారు. అయితే త్వరలోనే లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీకి మారారు. అక్కడ మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సు చేశారు. రాజకీయాలను జీవిత వ్యాపకంగా మలచు కోవాలని ఆయన ఎప్పుడూ అనుకోలేదు. ఆసక్తి కూడా చూపలేదు. ఫిలాసఫీ, రాజకీయాలు లేదా చరిత్ర గురంచి ఆయన పట్టించుకునేవారు కాదు. అయితే సంగీతాన్ని ఇష్టపడేవారు. వెస్టర్న్, హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంతోపాటు ఆధునిక సంగీతాన్ని కూడా ఇష్టపడేవారు. రాజీవ్ ఆసక్తి కనబరిచే ఇతర అంశాల్లో ఫొటోగ్రఫీ, అమెచ్యూర్ రేడియో ముఖ్యమైనవి. కాగా, రాజీవ్‌కు అత్యంత ఇష్టమైనవి గాల్లో ప్రయాణించడం. ఇంగ్లండ్ నుంచి తిరిగివచ్చిన వెంటనే ఢిల్లీ ఫ్లయింగ్ క్లబ్ ఎంట్రన్స్ పరీక్ష పాసై కమర్షియల్ పైలెట్ లైసెన్సు తీసుకోవడానికి వెళ్ళారు. అనతికాలంలోనే దేశీ విమాన సంస్థ ఇండియన్ ఎయిర్‌లైన్స్ లో పైలెట్ జీవితం ప్రారంభించారు. కేంబ్రిడ్జ్ లో ఉన్న సమయంలో ఇంగ్లీష్ చదివే ఇటాలియన్ మహిళ సోనియా మైనోతో ఆయనకు పరిచయమయింది. 1968లో ఢిల్లీలో వారు ఇద్దరూ పెళ్ళి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు రాహుల్, ప్రియాంకతో కలసి వారు ఢిల్లీలో ఇందిరాగాంధీ ఇంట్లో నివాసం ఉన్నారు. చుట్టూ రాజకీయ కోలాహలం ఉన్నప్పటికీ వారిది మాత్రం పూర్తిగా వ్యక్తిగత జీవితం. కానీ, 1980లో సోదరుడు సంజయ్‌గాంధీ విమాన ప్రమాదంలో మరణించడంతో పరిస్థితి మారింది. అప్పట్లో అంతర్గతంగా, బహిర్గతంగా అనేక సవాళ్ళు చుట్టుముట్టిన పరిస్థితుల్లో తల్లికి చేయూతను ఇవ్వడానికి రాజకీయాల్లో చేరవలసిందిగా రాజీవ్‌గాంధీపై వత్తిడి పెరిగింది. మొదట్లో వీటిని ప్రతిఘటించినప్పటికీ తరువాత తల వొగ్గక తప్పలేదు. తమ్ముని మృతి కారణంగా ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో రాజీవ్‌గాంధీ గెలుపొందారు. 1982 నవంబర్‌లో భారత్ ఆసియా క్రీడలకు ఆతిథ్యం ఇచ్చినపుడు అంతకు చాలా సంవత్సరాల ముందు జరిగిన ఒప్పందానికి కట్టుబడి స్టేడియంలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించే కార్యక్రమాన్ని రాజీవ్‌గాంధీ విజయవంతంగా పూర్తిచేశారు. వీటి పని సకాలంలో పూర్తయ్యేలా చూసే బాధ్యతను రాజీవ్‌గాంధీకి అప్పగించారు. ఈ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తిచేయడం ద్వారా రాజీవ్‌గాంధీ తన సామర్థ్యాన్ని, సమన్వయ స్ఫూర్తిని చాటుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే ప్రక్రియను తన భుజస్కందాలపై వేసుకున్నారు. ఆ తరువాత కాలంలో అనేక పరీక్షా సమయాల్లో రాజీవ్‌గాంధీ శక్తి సామర్థ్యాలు, ప్రజ్ఞాపాటవాలు బయటపడుతూ వచ్చాయి.

# రాజయ్య చిత్రాలు... సజీవ రూపాల..



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

**ఆగస్టు 20...**
**కాపు రాజయ్య వర్ధంతి**

కాపు రాజయ్య. ఈ పేరు తెలియని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. కాపు రాజయ్య ( ఏప్రిల్ 7, 1925 %-% ఆగష్టు 20, 2012) తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు. గ్రామీణ నేపథ్యం గల చిత్రాలకు ఆయన పెట్టింది పేరు. ఈయన చిత్రపటాలు ప్రపంచం లోని పలు దేశాలలో ప్రదర్శింప బడడం తెలుగు వారికి గర్వకారణం.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఊరూరా వీధి వీధిన, వాడవాడలా ప్రదర్శితాలై, ఉద్యమ కారుల తో మమేకమైన తెలంగాణ గ్రామీణ సాంస్కృతిక రూపాలు అయిన బోనాలు, బతుకమ్మలు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగి పాలనా పగ్గాలు తెరాస చేపట్టాక, అధికారిక పండుగలుగా ప్రకటింప బడటం అందరికి తెలిసిందే. అయితే రాజయ్య ఆయా సాంస్కృతిక వారసత్వ ప్రతీకలను కళా రూపాలుగా దశాబ్దాల క్రితమే కాన్వాసుపై చిత్రీకరించి గ్రామీణ సంస్కృతి ప్రాధాన్యత చాటి చెప్పారు.

దైవదత్తమైన ఆయన కుంచెతో ఏ గీత గీసినా, ఆ కుంచె వాటికి ప్రాణం పోసేది. అందుకే ఆయన చిత్రాలు జీవం పోసుకుని కళ్లముందు సజీవంగా కదలాడుతున్నట్లు కనిపిస్తాయి. గ్రామీణ జీవితాలను నిశితంగా పరిశీలించి, సృజనాత్మకత ఉట్టి పడేలా ఆయన వేసిన చిత్రాలు సహజత్వానికి ప్రతిబింబాలు. నిజానికి ఆ చిత్రాలు సామాన్యమైన జనజీవనం తో ముడివడి ఉన్నవే.

చీరలపై కనిపించే కోలాటం వంటి బొమ్మలు, కూడా వసంత కేళి, రాధాకృష్ణుల చిత్రం, 'పొలం పనులు' సోది చెప్పే మహిళ, పాలమ్మో పాలు అంటూ వీధుల్లోకి వెళ్ళే గొల్లభామల చిత్రాలు, వడ్డెర మహిళ, ఎల్లమ్మ జోగి ఒక్కొక్కటి రాజయ్య మునివేళ్లతో అలవోకగా చిత్రీకరించిన ఒక కళా ఖండమే. తెలంగాణ పల్లె సీమలకు సంబంధించి జానపదుల జీవితాలతో పెనవేసుకున్న సహజ దృశ్యాలను చిత్రించిన కళాకారులు మరొకరు లేరనేది నూటికి నూరుపాళ్లు నిజం.

కాపు రాజయ్య మెదక్ జిల్లా సిద్ధిపేటలో 1925 ఏప్రిల్ 7వ తేదీన జన్మించారు. హైదరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఆయన చిత్రకళలో డిప్లమా పొందారు. డ్రాయింగ్‌లో మద్రాసు ప్రభుత్వ డిప్లమా కూడా పొందారు.1963 లో తాను స్థాపించిన లలితకళా సమితి / అకాడమీ ద్వారా ఆయన చెకోస్లోవికియా, హంగేరి, రుమేనియా, బల్గేరియా దేశాల్లో ప్రదర్శనలు పెట్టారు.



నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన కళారంగంలో అత్యున్నత స్థాయికి చేరుకున్నారు. చిన్న వయస్సు లోనే తండ్రి మరణించడంతో ఆయన తీవ్రమైన ఇబ్బందుల పాలయ్యారు. కాపు రాజయ్య కుటుంబాన్ని తండ్రి మిత్రుడు మార్క చంద్రయ్య ఆదుకున్నారు. చిత్రకళలో కాపు రాజయ్యకు కుబేరుడు అనే ఉపాధ్యాయుని ప్రోత్సహించారు. ఉన్నత పాఠశాల లో చదువు తున్నపుడు ఆయన మొదటి చిత్ర ప్రదర్శన జరిగింది. ఆ తర్వాత దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా ఆయన తన కుంచెతో చిత్రాలకు ప్రాణప్రతిష్ట చేశారు. తెలుగు చిత్ర కళకు అంతర్జాతీయ కీర్తిని ఆర్జించి పెట్ట గలిగారు.

రాజయ్య తొలి చిత్రాలు సంప్రదాయబద్ధమైన, కాలపరీక్షకు నిలిచిన ప్రాచ్య విధానంలో, అంటే వాష్ పద్ధతిలో చిత్రాలు వేశారు. ఆ తర్వాత నకాషీ చిత్రకారుల అద్భుతమైన టెక్నిక్ ఆయను ముగ్ధుడ్ని చేసింది. దాంతో టెంపరా రంగుల వాడకాన్ని ప్రారంభించారు. నకాషీ చిత్రకారులంటే ఆయనకు ఎనలేని అభిమానం. ఇరవై ఏళ్ల పాటు 1950 నుంచి 1970 వరకు ఆయన టెంపరా చిత్రాలు వేశారు. రాజయ్యను 50కి పైగా అవార్డులు వరించాయి. రాష్ట్రప్రభుత్వం ఆయనను 1966లో రజత పత్రంతో, 1969లో తామ్ర పత్రంతో సత్కరించింది. 1975లో ఆయనకు చిత్ర కళాప్రపూర్ణ సత్కారం లభించింది. సీనియర్ ఫెలోషిప్ (1988 లో భారతదేశ ప్రభుత్వం చే), 1992లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి చిత్రలేఖనంలో విశిష్ట పురస్కారం లభించింది. రాజయ్య 1993లో కళా ప్రవీణ, 1997లో కళా విభూషణ్, 2000లో హంస, 2007లో లలిత కళారత్న అవార్డు అందుకున్నారు. విదేశాల్లో సైతం ఆయన చిత్రాల ప్రదర్శనలు జరిగాయి. రాజయ్య చిత్రాలు పార్లమెంటు హౌస్, న్యూఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్, సాలార్‌జంగ్ మ్యూజియం, ఆంధ్రప్రదేశ్ లలితా కళా అకాడమీల్లో ప్రదర్శనకు ఉంచారు.

గ్రామీణ పేదల జీవన వైవిధ్య భరితమైన అశేష అజరామర చిత్రాలకు ప్రాణం పోసి, తెలుగు వారి ప్రాచీన కళా రూపాల ను దిగంతాలకు పరిచయం చేసి తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయిన కాపు రాజయ్య 20 ఆగస్టు 2012 ఆగస్టు 20న 87వ ఏట తనువు చాలించి శాశ్వత చిత్తరువుగా జన హృదయాలలో నిలిచి పోయారు.

## విదేశాలకు వెళ్లే విద్యార్థులకు
# అండదండలు ఏవీ !

దేశంలో నిరుద్యోగం తాండవిస్తోంది. ఎంతచదువు చదివినా అందుకు తగ్గ ఉద్యోగాలు రావడం లేదు. ఉపాధి అవకాశాలు కూడా దక్కడం లేదు. బతకడమెలా అన్నది ఇప్పుడు వేధిస్తున్న సమస్య. దీంతో యువతలో అనేకులు అమెరికా తదితర యూరప్ దేశాలు తరలి వెళుతున్నారు. విదేశాల్లో అవకాశాలు లేవన్న ప్రచారం జరుగుతున్నా.. పట్టించుకోకుండా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఆకలి వారిని పరుగులు పెట్టిస్తోంది. బాధ్యతులు నిలువనీయడం లేదు. దీంతో అప్పులు చేసి విదేశాల్లో ఉన్నత చదువులు చదివి అక్కడే ఉద్యోగాలు సంపాదించాలన్న పట్టుదలతో దేశం వీడుతున్నారు. వీరికిచ్చే రుణాలు కూడా భారం అవుతు న్నాయి. ఈ క్రమంలో అమెరికా చదువులు..డాలర్ కలలు కల్లలవుతున్నాయి. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు దక్కకపోవడంతో చాలామంది అమెరికా తదితర దేశాలవైపు చూస్తున్నారు. ఉన్నత చదువులు చదువుకుని..అక్కడే ఏదో ఉద్యోగం చేసుకుని స్థిరపడాలన్న కాంక్ష ఏటేటా పెరుగుతోంది. దీనికితోడు దేశంలో దారుణంగా పరిస్థితులు ఉంటున్నాయి. ఏటా దాదాపు రెండున్నర లక్షలమంది ఉన్నత చదువులకు అమెరికాకు వెళుతున్నట్లు తెలుస్తోంది. విదేశాలకు వెళ్లి చదువుకునే వారికి ప్రభుత్వ పరంగా ఎలాంటి సాయం అందడం లేదు, బ్యాంకులు సులువుగా రుణాలు ఇవ్వడం లేదు. నిజానికి ఇది కూడా ఓ ప్రహసనంగా మారింది. ఫీజులకు అసవరమైన మొత్తాన్ని, ఇతరత్రా ఖర్చులను బ్యాంకులు నేరుగా ఇచ్చివుంటే విద్యార్థులకు బాధలు తప్పేవి. ప్రభుత్వ విధానాలు, బ్యాంకుల సక్రమంగా పనిచేసివుంటే.. బ్యాంకు రుణాల కోసం, చదువుల ఖర్చులు కోసం అడ్డదారులు తొక్కాల్సిన అవసరం వచ్చేది కాదు. ఈ విషయంలో కేంద్రం తీరు దారుణంగా ఉంది. విదేశాల్లో చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ఉదారంగా రుణాలు ఇచ్చే పథకాలు రావాల్సి ఉంది. అలాగే ప్రభుత్వ పరంగానే కన్సల్టెన్సీ సాయం అందాలి. వారికి అమెరికా నిబంధనల మేరకు అసవరసమైన ఆర్థిక సాయం, టెక్నికల్ సాయం అందాలి. సులువుగా అమెరికా వెళ్లి చదువుకుని వచ్చేలా చూడాలి. కానీ అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. ఇకపోతే నానా తంటాలు పడి వీసా సంపాదించి ..అమెరికా లాంటి దేశాలకు వెళ్లే క్రమంలో అమెరికా వీసా నిబంధనలు, ఇమ్మిగ్రేషన్ విధానాలు తెలుసుకోక పోవడం వల్ల చాలామంది మోసపోతు న్నారు. దీనికితోడు పుట్టగొడుగుల్లా పుట్టుకు వచ్చిన కన్సల్టెంట్లు కూడా వీరి ఆత్రుతను సొమ్ముచేసుకుని సరైన గైడెన్స్ ఇవ్వడం లేదు. విదేశీ చదువుల కోసం ఎన్నో కలలు.. వాటిని సాకారం చేసుకొనేందుకు ఎన్నో రోజుల కష్టం.. వీసా వచ్చిందని విదేశాల్లో వాలిపోయినా, అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు అడిగే ప్రశ్నలకు సరైన జవాబులు చెప్పలేక ఎయిర్‌పోర్టు నుంచే స్వదేశానికి తిరిగుటపా కట్టాల్సి రావడం ఎంతగా కుంగదీస్తుందో అర్థం చేసుకోవాలి. ఇలాంటి ఘటనలు విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లాయి. విదేశాల్లో చదువులు,ఉద్యోగాలకోసం ఎన్నో కలలు కని, వాటిని సాకారం చేసుకొనేందుకు ఎంతో కష్టపడి తీరా అవకాశం లభించాక కొందరు చేజేతులా వాటిని కోల్పోతున్నారు. గతవారం అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన భారతీయ విద్యార్థులు చిన్నచిన్న పొరపాట్ల కారణంగా, అవగాహన లేమితో స్వదేశం రావాల్సిన దుస్థితి ఏర్పడింది. సాధారణంగా అమెరికాలో ప్రవేశించాక అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు విద్యార్థులను పేరు, తలిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, ఏ వర్సిటీలో ఏ కోర్సు చదవబోతున్నారు, ఎక్కడ ఉంటారు వంటివిషయాల్లో ఆరా తీస్తారు. ఆర్థిక స్థితిగతులు, ఆదాయ వనరులు, బ్యాంక్ స్టేట్‌మెంట్స్ వంటి వాటిపైనా ప్రశ్నలేసి ఆరా కూపీ లాగుతారు. అవసరమైతే అకౌంట్లు తీసి చూస్తారు. వాటికి ఓపికగా సమాధానాలు చెప్పాలి. ఈ నేపథ్యంలో అమెరికా వెళ్లే విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. అమెరికా కోసం ఎంతోకొంత రుణం తీసుకుని ఆ తరవాత బ్యాంకుల్లో బ్రోకర్ల ద్వారా డబ్బులు జమచేయడం...వీసా రాగానే బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేయడం వంటివి జరుగుతున్నాయి. అమెరికా వెళ్లేముందు ఫైనాన్షియల్ ప్రూఫ్స్, ఆథరైజేషన్ లెటర్లు, లోన్ డాక్యుమెంట్లు వంటివన్నీ సక్రమంగా ఉన్నాయా లేదా అని చూసుకోవాలి. తన వద్దలేవని చెప్పడంతో వెనక్కి పంపించారు. బ్యాంక్ నిల్వను చూపించని వారికి ఇదే పరిస్థితి తలెత్తింది. ఉన్నత విద్య కోసం అమెరికాకు క్యూ కడుతున్న ఇండియన్ స్టూడెంట్స్‌కు విద్యార్థులకు అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు ఇలా కూపీ లాగా షాక్ ఇస్తున్నారు. అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేకపోవడం, సోషల్ మీడియా పోస్టులు, బ్యాంకు ఖాతా లావాదేవీలు కూడా ఇమ్మిగ్రేషన్ అధికారులు చెక్ చేస్తారని గుర్తించాలి. ఇకపోతే అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన భారతీయ విద్యార్థులు చిన్నచిన్న పొరపాట్ల కారణంగా, అవగాహన లేమితో ఉంటే వెనక్కి పంపుతారని గుర్తించాలి. వివిధ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు లభించి వాటిలో చేరేందుకు వెళ్లినప్పటికీ ఇమ్మిగ్రేషన్ చెక్ చాలా ముఖ్యమని గుర్తించాలి. ఇమిగ్రేషన్ అధికారులు అడిగిన ప్రశ్నలకు కొందరు ఆంగ్లంలో సరిగా సమాధానాలు చెప్పగలగాలి. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు సూటిగా చెప్పాలి. ఆగస్టు, సెప్టెంబరు నుంచి మొదలయ్యే ఫాల్ సీజన్‌కు వెళ్లే విద్యార్థులు అన్ని సక్రమంగా ప్రిపేర్ అయి ఉండాలి. వీసా మంజూరు కోసం ఎలాంటి తప్పుడు ధ్రువపత్రాలను సమర్పించకూడదు. అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉద్యోగం చేయకూడదు. అలాంటి విషయాలు కూడా ఎవరితోనూ చర్చించకూడదని సూచిస్తున్నారు. చదువుకునే వర్సిటీ, కోర్సు గురించి పూర్తి వివరాలు తెలుసుకుని సమాధానం చెప్పగలగాలి. అలాగే విద్యార్థులకు సరైన అవగాహన కల్పించి, తక్కువ వడ్డీకి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు అన్ని రకాల సహాయసహకారాలు ప్రభుత్వం నుంచి అందేలా చూడాలి.

# మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**హైదరాబాద్ ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** రోడ్డు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ని వారి కార్యాలయంలో కలిసి మొక్కను అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ జగిత్యాల నియోజకవర్గంలో పాడైన మరియు నూతన రోడ్లు,వంతెనల విషయం లో నిదులు మంజూరు చేయాలని కోరగా మంత్రివర్యులు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ తెలిపారు.

## దివ్యాంగ విద్యార్థుల ఉపకార వేతనాలు పొందుటకు దరఖాస్తులకు ఆహ్వానం

**జనగామ ఆగస్ట్ 19 (ప్రజామంటలు) :** జనగామ జిల్లాలోని దివ్యాంగుల విద్యార్థుల కొరకు 2024-25 విద్యా సంవత్సరంలో ప్రీ-మెట్రిక్ స్కాలర్ షిప్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్ షిప్ తో పాటు టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ పథకంలో భాగముగా "నేషనల్ స్కాలర్ షిప్" లను ఆన్ లైన్ పోర్టల్ ద్వారా ఫ్రెష్ & రెన్యువల్ కొరకు దరఖాస్తులు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. నేషనల్ స్కాలర్ షిప్ పథకం 2024-25లో భాగముగా ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్ షిప్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్ షిప్ ల కొరకు శాఖ www.depwd.gov.in,ఆన్ లైన్ పోర్టల్ : https://schoolarahip gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత దరఖాస్తులను ఆన్ లైన్ పోర్టల్ లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.ప్రీ-మెట్రిక్ స్కాలర్ షిప్ కొరకు ( 9, 10వ తరగతి) చదువుతున్న వారు అర్హులని, దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ: 31-08-2024 అని, పోస్ట్-మెట్రిక్ స్కాలర్ షిప్ కొరకు ( ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్) కొరకు చదువుతున్న వారు అర్హులని, దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ: 31-10-2024 గాను, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ కొరకు (డిగ్రీ, పి.జీ. లేక డిప్లొమా) కొరకు చదువుతున్న వారు అర్హులని దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ: 31-10-2024గా పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగ విద్యార్థులు అందరూ నేషనల్ స్కాలర్ షిప్ పథకాన్ని వినియోగించుకోవాలని,పూర్తి వివరాలకు జనగామ మహిళ,శిశు,దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ వారిని సంప్రదించాలన్నారు.

## తెలుగు భాషా దినోత్సవ సంబరాలలో మాన్యపు భుజేందర్ కు పురస్కారం



**జనగామ ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక ముందస్తుగా నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ సంబరాలలో భాగంగా 138వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో తెలుగు తల్లి మమ్ములను క్షమించమ్మా! అను శీర్షికతో కవితాగానం చేసిన జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన కవి, కళాకారుడు, పోతన సాహిత్య కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మాన్యపు భుజేందర్ ను ఘనంగా సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ లోని బి. ఆర్. అంబేద్కర్ కొనసీమ జిల్లా, అమలాపురం అంబేద్కర్ కమ్యూనిటి భవనంలో ఈ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక వ్యవస్తాపక జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు కొల్లి రమావతి, జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి మాకే బాలర్జున సత్యన్నారాయణ, డా. పార్థసారధి, జాతీయ ప్రధాన కార్యదర్శి, జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరి భూషణం, జాతీయ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి చిట్టే లలిత, అమలాపురం శాసనసభ్యులు ఆనంద్ బాబు, శ్రీశ్రీ కళావేదిక జాతీయ, రాష్ట్ర, కోనసీమ జిల్లా కార్యవర్గ సభ్యులు పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన తెలుగు సాహితివేత్తలు, కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.



రాఖీ పౌర్ణమి సందర్భంగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కి రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యా నియోజకవర్గ ఇన్చార్జ్ డా. బోగ శ్రావణి



రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కు రాఖీ కట్టిన తన సోదరి డా. సమత. ఈ సందర్బంగా తన సోదరితో పాటు కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన డా. సంజయ్.

## భారీవర్షంలో పర్యటిస్తూ శిథిలావస్తలో ఉన్న ప్రజలకు సూచనలు చేసిన 31వ వార్డు కౌన్సిలర్ పెండెం గణేష్



**కోరుట్ల ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో కూరుస్తున్న భారీవర్షం లోను 31వ వార్డు కౌన్సిలర్ పెండెం గణేష్ వార్డులో పర్యటిస్తూ తన వార్డు ప్రజల క్షేమమే నా ధ్వేయమని, శిథిలావస్తలో వున్న ఇండ్లను, ఇండ్లలో వుండే ప్రజలకి సూచనలు చేస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేస్తూ శిధిలావస్థలో ఉన్న భవనాలను వర్షం వల్ల కూలిపోకముందే సురక్షిత ప్రాంతాలకు ప్రజలువెళ్లి తగు జాగ్రత్తలు తీసుకోవాలని పెండెం గణేష్ కోరారు.

## రుణమాఫీ పై వినతులు స్వీకరించేందుకు మండలానికి ఒక అధికారి నియామకం

**జనగామ ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** రైతులు రుణమాఫీ పై వినతులు అందించేందుకు ప్రతి మండలంలో ఒక వ్యవసాయ శాఖ అధికారిని నియమించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. జనగామ మండలం కు కరుణాకర్ 7288894739, బచ్చన్నపేటకు విద్యాకర్ రెడ్డి, 7288894741, నర్మెట్టకు సంతోషి7288894742, తరిగొప్పులకు బీనా7288894738, పాలకుర్తి కి పరశురాం7288894732, కొడకండ్లకు విజయ్ రెడ్డి7288894737, దేవరుప్పలకు సంతోష్ 8096116885, స్టేషన్ఘన్పూర్ కు చంద్రన్ కుమార్7288894727, చిల్పూర్ కు వినయ్ కుమార్ 8247637915, జఫర్గడ్ కు శిరీష 7993368101, రఘునాథపల్లి కి శ్రీనివాసరెడ్డి7288894730, లింగాల ఘనపూర్ కు వెంకటేశ్వర్లు7288894731 వ్యవసాయ శాఖ అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జనగామ, రఘునాథపల్లి మండలాలలో వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం లోనూ, మిగతా మండలాలలో రైతు వేదిక లోనూ అధికారులు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి రైతు యొక్క సమస్యను పరిష్కరించే వరకు రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందని రైతులు ఈ విషయమై సంబంధిత అధికారులని మండలాలలో కలిసి వినతులు అందించవలసిందిగా తెలియజేశారు. అదేవిధంగా కెనరా బ్యాంక్ నవాబుపేట, జనగామ బ్రాంచ్ లలో, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనగామ బ్రాంచ్ లోను సాంకేతిక కారణములతో రైతుల పేర్లు రుణమాఫీ లిస్టులో రానందున వారి పేర్లను ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు.





రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాదులోని తెలంగాణ భవన్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ బిఆరెస్ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ, మాజీ మంత్రి, బిఅర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్ కు రాఖీ కట్టి, శుభాకాంక్షలు తెలిపారు.

# నమిలే ఎల్లయ్య వర్ధంతి
## జనగామలో అన్నదానం



**జనగామ ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** జనగామ పట్టణ మాజీ కౌన్సిలర్ నమిలే ఎల్లయ్య వర్ధంతి సందర్భంగా కుమారులు నమిలేశంకర్, సుమన్ చిద్విలాస్ లక్కీ లిఖిత్ కుటుంబ సభ్యులు స్థానిక రైల్వే స్టేషన్ వద్ద 200 నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు,ధర్మపురి శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, జక్కుల వేణుమాధవ్, చింతకింది మల్లేష్ ,ఏం డి అజరుద్దీన్, యారా మల్లేష్, సాయి చందు కొత్తపల్లి సుధాకర్, కొత్తపల్లి ప్రకాష్, రాజు, సాయిరాం పాల్గొన్నారు.

## రక్తదానం చేయడానికి వచ్చిన ఖాన్స్ కుటుంబం




**కోరుట్ల ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** చరిత్ర సృష్టించిన ఖాన్స్ కుటుంబ సభ్యులు ఒక నిండు ప్రాణానికి 5 గురు రక్త దాతలు అండగా నిలిచారు. కోరుట్ల పట్టణానికి చెందిన శైనాజ్ డెంగ్యూ చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా, వైద్యులు అత్యవసరంగా 5 ప్యాకెట్లు ఆర్.డి.పి. ఎక్కించాలని కొరగా, వారి బంధువులు కోరుట్ల సోషల్ సర్వీస్ గ్రూప్ సభ్యులకు సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించిన గ్రూప్ సభ్యులు ఒకే కుటుంబానికి చెందిన 5 గురు రక్తదాతలు ఖాన్స్ కుటుంబ సభ్యులు షాఖాన్, ఇమ్రాన్ ఖాన్, ఫుర్ ఖాన్, అబ్బాస్ ఖాన్, అక్బర్ ఖాన్, కోరుట్ల నుండి కరీంనగర్ వెళ్లి చరిత్ర సృష్టించారు. రక్త దానం చేసిన 5 గురిని సామాజిక కార్యకర్తలు. జగిత్యాల జిల్లా ప్రాణ దాతల సమూహం సభ్యులు, కోరుట్ల సోషల్ సర్వీస్ సభ్యులు, ఆమెర్ ఖాన్, ఖాన్ సాబ్, రియాజుద్దీన్ శాను తదితరులు అభినందించారు.




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ ఫోటోగ్రఫీ 2024 పోటీలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఫోటోగ్రాపర్ గా హైదరాబాద్ లో అవార్డు అందుకున్న జనగామ దినపత్రిక ఫోటోగ్రాపర్ రచ్చ మోహన్.

# మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక శ్రీ సత్యనారాయణ వ్రతములు – ఉపాకర్మ(మౌంజి)






హైదరాబాద్ ఆగస్టు 19 (ప్రజా మంటలు) : ముషీరాబాద్ బోలక్ పూర్ (తోటగుడి )భవాని శంకర్ దేవస్థానంలో సోమవారం శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి ఎంబీబీఎస్ శ్రీ శారద చంద్రమౌళీశ్వర రుద్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత సామూహిక బ్రాహ్మణ ఉపాకర్మ( మౌంజి) మరియు అన్నవర శ్రీ సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతములు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మణ సంఘ బంధువులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక శోభతో ఆలయమంతా మారుమోగింది. వైదిక కార్యక్రమంలో అధ్యక్షులు ధోర్బల కృష్ణమూర్తి కార్యదర్శి ఘనపురం రాంప్రసాద్ శర్మ, కోశాధికారి యలమంచిలి రామకృష్ణ శర్మ, కన్వీనర్ మహదేవ్ భట్ల లక్ష్మణ ప్రసాద్ శర్మ,నెమ్మా ని విష్ణు శర్మ,సిరిసిల్ల.రాంప్రసాద్ శర్మ, దామెర సత్యనారాయణ శర్మ, పడిగచెర్ల విష్ణుమూర్తి శర్మ, చంద్రశేఖర్ శర్మ, రాజనాల వెంకటేశ్వర శర్మ, నరేంద్ర శర్మ, విజయ్ కుమార్ శర్మ, యలమంచి చంద్రశేఖర్ శర్మ, జోషి సత్యనారాయణ శర్మ, జోషి రమేష్ శర్మ, మహదేవ్ శర్మ, గోసం గారి సత్యనారాయణ శర్మ, కొడగండ్ల రాధాకృష్ణ శర్మ రామోజుల విజయ్ కుమార్ శర్మ, గోళ్ళ గోవర్ధన్ శర్మ ,కూచి వంశీధర్ శర్మ ,దోముడాల విశ్వనాథ శర్మ, చాడ చిరంజీవి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి భవనంలో ఘనంగా 'జంధ్యాల పూర్ణిమ' వేడుకలు




గొల్లపల్లి ఆగస్ట్ 19 (ప్రజామంటలు): జంద్యాల (నూలు) పౌర్ణమి సందర్భంగా గొల్లపల్లి మండలం కెంద్రం లోని పద్మశాలి సంఘ భవనం లొ జంద్యాల పౌర్ణమి ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్బంగా మర్కండేయ స్వామికి పూజలు చేసి సభ్యులు నూతన యజ్ఞోపవీతము దరించారు. అనంతరం సంఘం అద్యక్షులు చౌటపెల్లి తిరుపతి మాట్లాడుతూ శ్రావణ పూర్ణిమను జంధ్యాల (నూలు) పూర్ణిమ అని కూడా అంటారని ఈ రోజున నూతన యజ్ఞోపవీత ధారణ చేసి, జప, అర్చనాదులను నిర్వహిస్తుంటారని యజ్ఞోపవీతము అనే పదము 'యజ్ఞము' 'ఉపవీతము' అనే రెండు పదాల కలయికవల్ల ఏర్పడిందని. యజ్ఞము అంటే 'యాగము' 'ఉపవీతము' అంటే దారము అనే అర్థాలున్నాయన్నారు ఈ 'జంధ్యాల పూర్ణిమ' కేవలం ఉపనయన సంస్కారం ఉన్న వారికే పరిమితమైనప్పటికీ మిగతా వారు కూడా ఈ రోజు అష్టోత్తరాలతో యాధాశక్తి గాయత్రీ దేవిని పూజిస్తే సకల శుభాలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రదాన కార్యదర్శి అందె లక్ష్మణ్, కోశాదికారి అంకం లింబాద్రి, ఉపాద్యక్షులు ఎనగందుల శంకర్, మండల పద్మశాలి సేవా సంఘం ప్రదాన కార్యదర్శి అంకం భూమయ్య, ధర్మపురి మల్లెశం, కొమాకుల భూమయ్య, అనుమల్ల శ్రీధర్, ఆడెపు హిమాకర్ లు పాల్గొన్నారు

## సోదరభావానికి నిలువెత్తు నిదర్శనం రాఖీ పూర్ణిమ

### మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి




జగిత్యాల ఆగస్ట్ 19 (ప్రజామంటలు): సోదరభావానికి నిలువెత్తు నిదర్శనమే రాఖీ పౌర్ణమి అని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఇరువురికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల్లో గొప్ప ఆచారమని పేర్కొన్నారు. ప్రజల మధ్య సోదరభావం మరింతగా పరిణావిల్లాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ లక్ష్మణ్ కుమార్ లు ఆకాంక్షించారు. సోదరభావంతో ప్రేమానురాగాలతో ప్రతి సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి నాడు, రాఖీలు కట్టుకుంటూ జరుపుకునే రాఖీ పండుగ, భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల్లో అనాది నుంచి కొనసాగుతున్న గొప్ప ఆచారమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

# గాంధీ డాక్టర్లు పట్టించుకోవడం లేదంటూ మెసెజ్ వైరల్

## వైరల్ తర్వాతే డాక్టర్లు స్పందించారన్న బంధువులు

### పేషంట్ కు బాగానే ట్రీట్మెంట్ చేస్తున్నామని సూపరింటెండెంట్ వివరణ



సికింద్రాబాద్ ఆగస్ట్ 19 (ప్రజామంటలు): అత్యవసర వైద్యం అందించాల్సిన పేషంట్ ను గాంధీ ఆసుపత్రిలో డాక్టర్లు పట్టించుకోవడం లేదంటూ ఓ మెసెజ్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దీనిపై వైద్యాధికారులు స్పందించారు. వివరాలు ఇవి..ఈస్ట్ గోదావరి జిల్లా మండపేట సమీపంలోని కపిలేశ్వపురం మండలం తాటిపూడి గ్రామానికి చెందిన ఇల్ల శ్రీనివాస్, సుశీల దంపతులు గత కొంత కాలం క్రితం జీవనోపాధికై సిటీకి వచ్చి, అంబర్ పేట తిరుమల నగర్ లో కుటుంబంతో కలసి నివాసం ఉంటున్నారు. అపార్ట్ మెంట్ లో శ్రీనివాస్ వాచ్మెన్ గా పనిచేస్తున్నాడు. ఈనెల 18న ఉదయం శ్రీను కూతురు జ్యోతి(25) ప్రమాదావశాత్తు కాలుజారి అపార్ట్ మెంట్ లోని నాలుగవ ఫ్లోర్ నుంచి కిందపడగా, తలతో పాటు వెన్నముక, కాళ్ళకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్ లో గాంధీ ఆసుపత్రికి తీసుకురాగా, ఎమర్జెన్సీ వార్డులో ఎమ్ఎల్సీ కింద అడ్మిట్ చేశారు. అయితే జూడాల సమ్మె నేపద్యంలో పేషంట్ జ్యోతికి అత్యవసరమైన సర్జరీ చేయడం కుదరదని డాక్టర్లు చెబుతున్నారని, తాము ఏపీ కి చెందినవారు కావడంతో ఆరోగ్యశ్రీ కూడ వర్తించదని అంటున్నారని పేర్కొంటూ పేషంట్ జ్యోతి ఫ్యామిలీ మెంబర్స్ సోమవారం సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. కోల్ కతా లో చనిపోయిన డాక్టర్ కూడ తన కూతురు లాంటిదే నని, ఇప్పుడు మాత్రం ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన కూతురును బతికించడండి అంటూ ఆ మెసెజ్ లో వేడుకున్నారు. దీంతో ఈ విషయం వైరల్ కావడంతో వైద్యులు స్పందించారు. తాము సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వెంటనే న్యూరో సర్జన్ డాక్టర్లు పేషంట్ వద్దకు చేరుకొని ట్రీట్మెంట్ ప్రారంభించారని పేషంట్ జ్యోతి బావ రవిశంకర్ తెలిపారు. ఈవిషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారిని సంప్రదించగా, పేషంట్ ఆరోగ్య పరిస్థితి క్రిటికల్ గా ఉందని, జ్యోతి ఇంకా షాక్ లోనే ఉందన్నారు. తీవ్ర గాయాలైనందున డాక్టర్లు ప్రత్యేక శ్రద్దతో ట్రీట్మెంట్ చేస్తున్నారని తెలిపారు. పేషంట్ స్థానికులు కానప్పటికీ, ఆరోగ్యశ్రీ వర్తించనప్పటికీ సమస్య లేదన్నారు. అవసరమైతే పేషంట్ ట్రీట్మెంట్ ఖర్చులు ఆసుపత్రినిధుల నుంచి ఖర్చు పెడతామని భరోసా ఇచ్చారు. డాక్టర్ల నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు. గతంలో చాలా సందర్భాల్లో ఆసుపత్రి నిధులతో పేషంట్లకు అవసరమైన వైద్యం అందించామని సూపరింటెండెంట్ గుర్తుచేశారు.

## మహిళా కండక్టర్ కు ఎండీ సజ్జనార్ అభినందనలు.. కారణం



హైదరాబాద్, (ప్రజా మంటలు): మహిళా కండక్టర్ కు టీజీ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందనలు తెలిపారు. రక్షాబంధన్ సందర్భంగా బస్సులో గర్భిణిపై పురుడు పోసిన కండక్టర్ భారతిని తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం తరపున ఎండీ సజ్జనార్ అభినందించారు.కండక్టర్ సకాలంలో డెలివరీ చేయడం, బస్సులోనే నర్సు ప్రయాణం చేస్తుండటంతో ఆమె కూడా సాయం చేయడంతో తల్లీ బిడ్డ క్షేమంగా బయటపడ్డారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతూ ఆర్టీసీ ఉద్యోగులు సామాజిక బాధ్యతగా సేవాభావాన్ని ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. ప్రయాణంలో ఓ గర్భిణీకి పురుడు పోసిన భారతిని సభాష్ అంటూ సజ్జనార్ చేసిన ట్వీట్ వైరల్ గా మారింది.


## శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం సందర్బంగా

### ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ




కొడిమ్యల ఆగస్త్ 19 (ప్రజామంటలు): శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ప్రతి నెల స్వామివారి జన్మనక్షత్రం (9వ) సందర్భంగా సహస్ర పుష్పాబిషేకము, గోపూజ, కుమారి చెట్టే భవ్యశ్రీ – కీర్తన ల భరతనాట్యం, రక్ష బందన్ మరియు అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం అర్చకులు నాగరాజు రమేష్ మరియు ఆలయ నిర్మాణ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అన్నప్రసాద దాత : ఎడమల రాంరెడ్డి – శ్యామల ల కుటుంబం. ఇట్టి కార్యక్రమంలో దాతలు, భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు, ఇట్టి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన భక్తులకు ఆలయ నిర్మాణ కమిటి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## అఖిల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక ఉపాకర్మ



జగిత్యాల ఆగస్టు 19 (ప్రజా మంటలు): జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వీధి శ్రీరామ మందిరంలో అఖిల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రావణ పౌర్ణమి పురస్కరించుకొని సామూహిక ఉపాకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన యజ్ఞోపవీత ధారణ ,ఋషి తర్పణము తో పాటు పాత యజ్ఞోపవీతమును తొలగించి నూతన యజ్ఞోపవితం ధరించారు. పంచగవ్యం స్వీకరించారు. కార్యక్రమానంతరం హొమగుండం ప్రదక్షణ, మహదాశీర్వచనం నిర్వహించారు. బ్రాహ్మణ బంధువులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అన్యారంభట్ల సాంబయ్య శర్మ ,సభాపతి తిగుళ్ల సూర్యనారాయణ శర్మ తదితరులు నిర్వహించారు.

# ప్రిన్సిపాల్ ను సన్మానించిన పోసానిపేట పద్మశాలీ సంఘం



**కోరుట్ల ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా మెటుపల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన కే.వేంకయ్యను సోమవారం రోజున కోరుట్ల పట్టణంలోని పోసానిపేట గ్రామానికీ చెందిన పద్మశాలీ సంఘం అధ్యక్షులు చిలుక శంకర్ ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా శాలువాతో సన్మానం చేశారు. సందర్భంగా సంఘం అధ్యక్షులు చిలుక శంకర్ మాట్లాడుతూ, బీడీలు చేసుకుంటూ వేంకయ్య చదువుకున్నాడని,ఆయన భార్య లక్ష్మి ఇచ్చిన ప్రోత్సాహంతోనే సంఘంలో ఒక మంచి స్థానం సంపాదించారని కొనియాడారు. విద్యార్థి లోకానికి ఆ దంపతులు ఆదర్శమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు క్యాతం ప్రసాద్,క్యాతం మల్లేశం, శ్రీరాముల రాజేందర్, అల్లె కృష్ణహరి, బత్తుల రాజ గంగారాం, చిలుక ఆనందం, చిలుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



**హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలో ఉదయం 6ః00 గంటల సుమారుగా జనుగాని సధానందం రోజువారీ కుల వృత్తి లో భాగంగా తాడి చెట్టు ఎక్కుతున్న క్రమంలో కాలు జారిపై నుండి పడి ప్రాణాలు కోల్పోయిన మరొ గీతన్న ప్రభుత్వం సేఫ్టీ మోకుల పంచడం జాప్యంలో ఇంకా ఎన్ని ప్రాణాలు పోవాలి**

**జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో తమ్ముడికి రాఖీ కట్టి తమ్ముడి చేతిని తన చేతితో జాగ్రత్తగా పట్టుకుని కొత్త బస్టాండ్ లో ఒక చిన్నారి తన తమ్ముడిని రక్షాబంధన్ రోజున ఇలా పట్టుకొని ఎంతో ఆత్మీయంగా కనిపించింది. సంఘటనను బస్టాండులో పలువురు చూసి ఆశ్చర్యపోయారు.**





**దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్న కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్.**

# సాయిబాబా ఆలయంలో పౌర్ణమి వేడుకలు



**కొడిమ్యాల ఆగస్త్ 19 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండల కేంద్రంలోని సాయి బాబా ఆలయం లో శ్రావణ పౌర్ణమి (రాఖీ పౌర్ణమి) సందర్భంగా పూజలు, సత్య నారాయణ వ్రతం, హారతి, పల్లకి సేవ, రక్షా బంధన్ నిర్వహించారు. అనంతరం గుండేటి రమేష్ అన్న ప్రసాదం చేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ బాధ్యులు గుండేటి రమేష్, ఏనుగు ఆదిరెడ్డి, ఏళ్ళం శ్రీనివాస్, నార కట్ల మహిపాల్, మోహన్, పూజారి నాగరాజ శ్రీనివాస్, తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

# దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసిన ఎంపీ డా.కడియం కావ్య,ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వేలేరు ఆగస్ట్ 19 (ప్రజామంటలు) :** హైదరాబాద్ లోని రైల్వే నిలయంలో సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మెనేజర్ అరుణ్ కుమార్ జైన్ గారితో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి గారు సమావేశం అయ్యారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్ లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలని జీఎంకు వినతి పత్రం అందజేశారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని అనేక రైల్వే పనులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని సత్వరమే పూర్తి చేయాలని వారు కోరారు. కాజీపేట మరియు వరంగల్ స్టేషన్లు రెండూ భారతీయ రైల్వేలో చాలా ముఖ్యమైన స్టేషన్లు, అవి రైల్వేలోని ఉత్తర మరియు దక్షిణ భారతదేశ భాగాలను కలిపే బహుళ దిశల రైలు ట్రాఫిక్‌తో వ్యవహరిస్తాయని వారు పేర్కొన్నారు. ప్రధానంగ కాజీపేట స్టేషన్ అభివృద్ధిలో భాగంగా అదనపు ప్లాట్‌ఫారమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. వరంగల్ మరియు కాజీపేట రైల్వే స్టేషన్లలో ప్రజల రాకపోకల దృష్ట్యా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు మరియు ఎస్కలేటర్లతో కూడిన మరో రెండు ప్లాట్‌ఫారమ్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసారు. కాజీపేట టౌన్ స్టేషన్‌ను పూర్తి స్థాయి స్టాపింగ్ స్టేషన్‌గా మార్చేందుకు కృషి చేయాలని అభ్యర్థించారు. కాజీపేటలో 3000 మందికి పైగా రైల్వే ఉద్యోగులు మరియు వైద్య సహాయం అవసరమయ్యే రిటైర్డ్ ఉద్యోగస్తులు సమాన సంఖ్యలో ఉన్నారని వారఅందరి కోసం కాజీపేటలో రైల్వే సబ్-డివిజనల్ హాస్పిటల్ అభివృద్ధి చేయడంతో పాటు అదనపు సిబ్బంది, అదనపు సౌకర్యాలు, నిపుణులైన వైద్యులతో పూర్తిస్థాయి సబ్ డివిజనల్ ఆసుపత్రిని ప్రారంభించేందుకు మరిన్ని నిధులు కేటాయించాలని, ఈ అభివృద్ధి కార్యకలాపాలను వేగవంతం చేయాలని కోరారు. రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ /ఉద్యోగుల రిక్రియేషన్ క్లబ్ కొత్త భవనం ఏర్పాటుతో పాటు కమ్యూనిటీ హాల్ అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజనల్ హెడ్‌క్వార్టర్స్‌లో అనేక డివిజన్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని ఇక్కడ నుండి అధిక సంఖ్యలో అధికారులు హైదరాబాద్ మరియు విజయవాడలకు వెళతారు. ఈ రైల్వే స్టేషన్ చుట్టూ దాదాపు 60 గ్రామాలు ఉన్నాయని, ప్రజలు మరియు ముఖ్యంగా వ్యాపారవేత్తలు హైదరాబాద్ మరియు తిరుపతికి తరచుగా ప్రయాణిస్తుంటారు. దీనిని పరిశీలించి, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను స్టేషన్‌ఘన్‌పూర్‌లో రెగ్యులర్‌గా ఆగేవిధంగా చూడాలని కోరారు. నష్కల్ నుండి హసన్ పర్తి, మరియు నష్కల్ నుండి చింతలపల్లి వరకు రెండు మార్గాల్లో రైల్వే బైపాస్ లైన్ లను నిర్మించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయొ ప్రమాదం ఉందని, మరోవైపు వరంగల్ పట్టణ ప్రాంతం గుండా వెళ్లే రైల్వే బైపాస్ మార్గం వలన పట్టణాభివృద్ధికి అడ్డంకిగా మారే ప్రమాదం ఉందని జీఎం గారికి దృష్టికి తీసుకువెళ్లి, దీనికి ప్రత్యామ్నాయంగా అలైన్ మెంట్ లో మార్పుచేసి మరో మార్గములో రైల్వేలైన్ ను ఏర్పాటు చేయాలని కోరారు. దక్షిణ మధ్య రైల్వేలో మరో డివిజన్ ఉండేలా కాజీపేట డివిజన్‌ను ఏర్పాటు చేయడంలో అన్ని సమర్థన మరియు ప్రయోజనం ఉందని, ఈ అంశాన్ని పరిశీలించి కాజీపేటలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చెయాలని కోరారు. అనంతరం రైల్వే సబ్ డివిజన్ హాస్పిటల్ ఏర్పాటుపై సానుకూలంగా స్పందించిన జీఎం ఆస్పత్రి అభివృద్ధి పనుల కోసం 1.75 కోట్లు మంజూరు చేసినట్లుగా తెలియజేసారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మరియు కాజీపేట రైల్వే స్టేషన్ లో అదనపు ఫ్లాట్ ఫారమ్ ల ఏర్పాటు విషయంలో సానుకూలంగా స్పందించిన జీఎం త్వరలో అదనపు ఫ్లాట్ ఫారమ్ ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటామన్నారు. కాజీపేట టౌన్ స్టేషన్ వెయిటింగ్ హాల్ టాయిలెట్స్ నిర్మాణ పనులు చేపడతామని జీఎం తెలిపారు. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని రైల్వే బోర్డుకు అందజేయడం జరిగిందని, రైల్వే బోర్డు నిర్ణయం మేరకు త్వరలోనే డివిజన్ ఏర్పాటుకు చర్యలు చేపడతమన్నారు. పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను స్టేషన్‌ఘన్‌పూర్‌లో రెగ్యులర్‌గా ఆగేవిధంగా ప్రతిపాదనను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. నష్కల్ నుండి హసన్ పర్తి వరకు మరియు నష్కల్ నుండి చింతలపల్లి వరకు రెండు మార్గాల్లో రైల్వే బైపాస్ లైన్ మార్గాలకు ప్రత్యామ్నాయ ఏర్పాటును పరిశీలిస్తామని రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. ఈ విషయాలపై సమీక్షించి, తక్షణ చర్యలు చేపడతామని జీఎం హామీ ఇచ్చారని, తన అభ్యర్థనలపై రైల్వే జీఎం సానుకూలంగా స్పందించినందుకు వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ధన్యవాదాలు తెలియజేశారు.

# కూకట్పల్లి న్యాయవాదిపై దౌర్జన్యం చేసిన ఇన్స్పెక్టర్ ను విధుల నుండి తొలగించాలి

## బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి డిమాండ్



**కరీంనగర్ ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** న్యాయవాది సంతోష్ పై బోరబండ పోలీసుల వైఖరికి నిరసనగా కరీంనగర్ జిల్లా కోర్టు నాయవాదుల విధుల బహిష్కరణ. న్యాయవాదుల పై పోలీసులు చేస్తున్న దాడుల పై సి.ఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలి. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి డిమాండ్. కూకట్పల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న పి. సంతోష్ అనే న్యాయవాది పై బోరబండ ఇన్స్పెక్టర్ జమాల్, అతని పోలీస్ సిబ్బంది న్యాయవాది ఇంటిలోకి దౌర్జన్యంగా చొరబడి బనియన్, లుంగీ మీదనే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అడ్వకేట్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదులు సోమవారం రోజున విధులు బహిష్కరించి కోర్టు ఎదుట ప్లేకార్డ్స్ ప్రదర్శించి నిరసన వ్యక్తం చేయడం జరిగిందని కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఒక ఇంటిలో కిరాయికి ఉంటూ కూకట్పల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న పి.సంతోష్ అనే న్యాయవాది తను ఇంటిలో ఉండంగా బోరబండ పోలీస్ ఇన్స్పెక్టర్ జమాల్ అనే పోలీస్ అధికారి, అతని సిబ్బందితో తలుపులు తోసుకుంటూ ఇంటిలోకి ఆకారణంగా నిజనిజాలు తెలుసుకోకుండా దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ, దుషిస్తూ ఆ న్యాయవాది ఎంత చెప్పిన వినకుండా బనియన్, లుంగీ పైనే అరెస్ట్ చేసి దౌర్జన్యంగా పోలీస్ స్టేషన్ కు తరలించి స్టేషన్ లో అతని పై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దాడి చేయడం బోరబండ పోలీసులు గుండాల వలే వ్యవహరించినారని, ఈ దౌర్జన్యానికి పాల్పడ్డ ఇన్స్పెక్టర్ జమాల్ ను, పోలీస్ సిబ్బంది పై తక్షణమే కేసులు నమోదు చేసి వారిని విధుల నుండి తొలగించాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి తెలంగాణ డి.జి.పి ని డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు ముందు కూడా సిద్దిపేట, సిరిసిల్ల, జనగామ కోర్టులలో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదుల పై అక్కడి పోలీసుల ప్రవర్తనకు నిరసనగా న్యాయవాదులు ధర్నాలు, నిరసనలు, కోర్టు విధుల బహిష్కరణలతో కూడిన సంఘటనలు మరువక ముందే మళ్లీ ఈ కూకట్పల్లి పోలీసులు సంతోష్ అనే న్యాయవాది పై దౌర్జన్యం చేయడం పోలీసుల వ్యవహార శైలి, వారి అత్యుత్సాహానికి నిదర్శనమని ఇలాంటి కొంతమంది పోలీసుల వైఖరి వల్లే మొత్తం వ్యవస్థకే మచ్చ తెచ్చే విధంగా ఉందని, ఈ మొత్తం సంఘటనల పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని, ఎందుకంటే న్యాయశాఖ, హెూంశాఖ మంత్రిత్వ శాఖలు రెండు ముఖ్యమంత్రి వద్దనే ఉన్నాయని ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. న్యాయవాదుల పై వరుస దాడులకు పాల్పడ్డ పోలీసుల ప్రవర్తనను పరిగణలోకి తీసుకొని వారి పై చట్టపరమైన చర్యలు తీసుకొని భవిష్యత్ లో మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసే బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి, డి.జి.పి లే తీసుకోవాలని, లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టులను స్థంబింపచేసి విధులు బహిష్కరించి అన్ని కోర్టుల ముందు టెంట్ లు వేసి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పోలీసుల ఆగడాలకు వ్యతిరేకంగా దీక్షలు, ధర్నాలు చేస్తామని కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు బెజ్జంకి శ్రీకాంత్, పస్తం ఆంజనేయులు, కొండ్ర లక్ష్మణ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు కటకం శ్రవణ్ కుమార్, దాసరి రామ్ రెడ్డి, గుడిపాటి సత్యం రెడ్డి, కట్ట రమేష్, వీరసుందర్ మల్యాల ప్రతాప్, దామోదర్ రెడ్డి, బలరాం, సర్దార్ గురుబీర్ సింగ్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్




**జగిత్యాల ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేసినారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఓ పి సేవలు, ల్యాబ్ రికార్డ్స్, మెడికల్ ఫార్మాసిని పరిశీలించి ఆసుపత్రిలో స్టాక్ పొజిషన్, సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, ప్రసూతి సేవల పేషెంట్లకు ఇబ్బంది కలుగకుండా వైద్య సేవలు కల్పించాలని సూచించారు.డెంగ్యూతో ఎక్కువగా ఎవరు రాలేదని, సాధారణ జ్వరాలతో అడ్మిట్ అవ్వడం జరిగిందని, వారితో శుభ్రమైన త్రాగునీరు, భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.అదే విధంగా పేషెంట్ల వివరాలను, వారి ఆరోగ్య పరిస్థితిని గురించి కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో అందరూ వైద్యులు, సిబ్బంది ఉన్నారా లేదా అని అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. అందుబాటులో లేని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ల్యాబ్ ని పరిశీలించి రక్త పరీక్షలు సరిగ్గా నిర్వహిస్తున్నారా లేదా అని ల్యాబ్ రికార్డ్స్ ని కలెక్టర్ చెక్ చేశారు.కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి యం డి సమీయొద్దీన్, ఆర్ ఎం ఓ,వైద్యులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# “రక్షా బంధన్ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్నకు రాఖీ కట్టిన దావ వసంతసురేష్



**హైదరాబాద్ ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** నందినగర్ లోని వారి నివాసంలో రక్షా బంధన్ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి రాఖీ కట్టి రామన్న ఆశీస్సులు తీసుకున్న జగిత్యాల జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంతసురేష్ జగిత్యాల జిల్లాలోని సోదర,సోదరీమణులందరికీ ఈ సందర్భంగా రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## జగిత్యాల పట్టణంలో ఘనంగా రక్షాబంధన్





**జగిత్యాల ఆగస్టు 19( ప్రజా మంటలు) :** జగిత్యాల పట్టణంలో సోమవారం రక్షాబంధన్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పలు కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు తోటి ఉద్యోగులకు రక్షాబంధనం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ఉద్యోగాల్లో ఉన్నత చదువుల రీత్యా దూర ప్రదేశాల్లో ఉన్న సోదరులు సొంత ఇంటికి రావడం అన్నదమ్ములకు అక్క చెల్లెలు రక్షాబంధనం చేసి స్వీట్ తినిపింపజేసి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు.

## సర్కిల్ ఇన్స్పెక్టర్ ను కలిసిన పద్మశాలి సంఘం నేతలు



**జనగామ ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** జనగామ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల నూతనంగా సీఐ బాధ్యతలు చేపట్టడంతో సోమవారం సిఐ కార్యాలయంలో రఘునాథపల్లి మండల పద్మశాలి సంఘం ప్రతినిధులు కలిసి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ జనగామ రూరల్ పరిధిలోని రఘునాథపల్లి లింగాల గణపురం. చిల్పూర్ మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ఏ సమస్యలున్న నేరుగా పోలీస్ స్టేషన్ కు వచ్చి తెలియజేయవచ్చని ఆయన కోరారు. ప్రజలు ప్రతి ఒక్కరూ గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి ఘర్షణకు పంచాయతీలకు తావు లేకుండా ప్రతి ఒక్కరు స్నేహభావం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ నరేష్ యాదవ్, జనగామ జిల్లా పద్మశాలి సంఘం ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి నేత,జనగామ జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర పద్మశాలి సంఘం నేత రాపోలు రామ్మూర్తి నేత, కొమ్ముల మాజీ సర్పంచ్ వల్ల అశోక్ నేత, సోషల్ మీడియా జనగామ జిల్లా నాయకులు రాపోలు పృథ్వి నేత పాల్గొన్నారు.

## అనకాపల్లి ఘటన...

### అనుమతి లేని హాస్టల్స్‌పై కఠిన చర్యలు: అనిత



**విశాఖపట్నం (ప్రజా మంటలు):** అనకాపల్లి జిల్లా కోటవురట్ల హాస్టల్‌లో ముగ్గురు మృతి చెందిన ఘటనపై హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా దీనిని కొనసాగిస్తున్నట్లు చెప్పారు.హాస్టల్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కేవలం కోటవురట్ల హాస్టల్ మాత్రమే కాకుండా రాష్ట్రంలో అనుమతి లేకుండా నడుస్తున్న అన్ని హాస్టల్స్‌పైనా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.సాధారణంగా ప్రభుత్వ అనుమతి ఉన్న హాస్టల్స్‌లో బయటి ఆహారపదార్థాలను అనుమతించబోరని, కానీ.. కోటవురట్ల హాస్టల్‌లో బయటి నుంచి ఎవరో తెచ్చిన ఆహారం తినడం వల్లే చిన్నారులు అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. కైలాస పట్టణంలోని హాస్టల్‌లో సమోసాలు తిని 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. వీరిలో సోమవారం ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మిగతావారిని నర్సీపట్నం, అనకాపల్లి ఏరియా ఆస్పత్రులతోపాటు, విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు.

# నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనం ఇద్దరం దేశానికి ధర్మానికి రక్ష



**జగిత్యాల ఆగస్టు 19 (ప్రజా మంటలు) :** రాఖీ పౌర్ణమి సందర్భంగా భారతీయ జనతా పార్టీ జగిత్యాల నియోజకవర్గ కార్యాలయం “కమల నిలయం” లో భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో రక్షాబంధన కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా బోగ శ్రావణి

**ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ....**

సనాతన ధర్మ విశిష్టతను రక్షాబంధన్ ఒక ప్రాముఖ్యతను స్నేహపూర్వకమైన బంధాన్ని తెలియజేస్తుంది. మాతృమూర్తుల బంధాన్ని అన్నదమ్ముల బంధాన్ని దేశం యొక్క సమాజసేవ బంధాన్ని మన దేశం సరిహద్దులలో అహర్నిశలు భద్రతతో కాపాడే జవాన్ల బంధాన్ని భిన్నత్వంలో ఏకత్వం అంటే నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనమిద్దరం దేశానికి ధర్మానికి రక్షా అని తెలియజేసే గొప్ప పండుగ రాఖీ పండుగ, రాఖీ అంటే ‘రక్షణ’ అని అర్థం. రాఖీ పండుగనే ‘రక్షా బంధన్’ అని కూడా పిలుస్తారు. ‘రక్ష’ అంటే రక్షించడం, ‘బంధన్’ సూత్రం కట్టడం అని అర్థం. అన్న లేదా తమ్ముడు విజయం దిశగా అడుగేయాలని, అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటూ.. సోదరి రాఖీ కడుతుంది. సోదరుడి విజయాన్ని సోదరి కాంక్షిస్తే.. ఏ కష్టమైనా నీకు అండగా నిలుస్తానని సోదరుడు హామీ ఇస్తాడు.

రాఖీ పండగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ రక్షాబంధన శుభాకాంక్షలు తెలియజేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, సిరికొండ రాజన్న, రూరల్ మండల అధ్యక్షులు నలువాల తిరుపతి, అర్బన్ మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, తుమ్మల గంగారం, గాదాసు రాజేందర్ బోగ రాజ్ కుమార్,గంగరాజం, మ్యాకల లక్ష్మి, సింగం పద్మ, గడ్డల లక్ష్మి, మధురిమ, భానుప్రియ, కవిత, సోమలక్ష్మి, లావణ్య, మంజు మరియు భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** జనగామ జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లో ఉన్న మిగిలిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రానికి చెందిన కె. నరేందర్, వ్యవసాయ శాఖకు సంబంధించి రైతు రుణ మాఫీ కొరకు సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకున్నారు.కుందారం గ్రామం, లింగాల ఘనపురం మండలానికి చెందిన గంగసాని రంజిత్ రెడ్డి, రెవెన్యూ శాఖకు సంబంధించి తమ 14 ఎకరాల 20 గుంటల భూమిని అక్రమంగా కౌలు పేరుతో సాగు చేస్తున్నందున భూదురాక్రమణ కింద తగిన చర్యలు తీసుకొనుట కోసం దరఖాస్తు చేసియున్నారు. నమలిగొండ గ్రామం, ఘనపూర్ (స్టేషన్) మండలానికి చెందిన నిమ్మ వెంకట్ రెడ్డి, ఉరుమడ్ల బుచ్చమ్మ, పెద్దపుంద్ర వెంకట రెడ్డిల ఇళ్లపై నుంచి విద్యుత్ సర్వీస్ లైన్ లను తొలగించాలని జనగామ విద్యుత్ ఎస్ఈకి అర్జీ ద్వారా కోరారు. ఖిలాషాపూర్ గ్రామం, రఘునాథపల్లి మండలానికి చెందిన విద్యా సాగర్ రెవెన్యూ శాఖకు సంబంధించిన తమ 5 గుంటల భూమిని అక్రమంగా చేసుకున్న పట్టా గురించి వినతిపత్రం అందజేశారు. పటేల్ గూడెం గ్రామం, లింగాల ఘనపురం మండలానికి చెందిన గ్రామ సర్పంచులు, సీడీఎఫ్ నిధులతో వేసిన సీసీ రోడ్డు నిర్మాణం ధ్వంసం గురించి అర్జీ చేశారు. ఇలా తదితర సమస్యలపై నేడు (10) దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికై అన్ని మండలాల సంబంధిత తహసిల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి, అప్పటికప్పుడు దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారంలో వేగం పెంచి, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, డిఆర్‌డిఓ వసంత, డిఈఓ రాము, జిల్లా పౌరసరఫరాల అధికారిణి రోజా రాణి, డబ్ల్యూఓ జయంతి, డిఎఓ వినోద్ కుమార్, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల రక్షణకు ప్రతీకగా రాఖీ

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** సోదర సోదరీమణులకు మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి ఆడబిడ్డకు రక్షణగా ఉండటం మన బాధ్యతను గుర్తుచేస్తుందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. సోమవారం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహిస్తోన్న బాలసదనం ఆశ్రమంలోని చిన్నారులతో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ లు రక్షాబంధన్ వేడుకలను ఆహ్లాదంగా జరుపుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పిల్లలు బేటీ బచావో.. బేటీ పడావో అనే నినాదంతో వారికి రాఖీలను కట్టారు. అలాగే వారు బాలసదనం చిన్నారులను ఆప్యాయంగా పలకరించి, పిల్లలతో ఎంతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం సదనం చిన్నారులందరికీ స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం బలసదనం చిన్నారులు జిల్లా అధికారులందరికీ రాఖీలు కట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, జిల్లా సంక్షేమ అధికారిని జె. జయంతి, జిల్లా బాల పరిరక్షణ అధికారి ఎల్. రవికాంత్, బాలసదనం సూపరింటెండెంట్ వెరోనిక, వివిధ శాఖల జిల్లా అధికారులు, హోమ్ సిబ్బంది, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

## పండగపూట రాజకీయ లబ్ధి కోసం కేటీఆర్ అవాస్తవాలు చెబుతున్నారు.



**హైదరాబాద్, (ప్రజా మంటలు):** రాఖీ పండుగ రోజు కూడా మహిళా మంత్రిని, మహిళా కమిషన్ చైర్పర్సన్ ను నిందించడం కేటీఆర్ కే చెల్లిందని మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. పండగపూట రాజకీయ లబ్ధి కోసం కేటీఆర్ అవాస్తవాలు చెబుతున్నారని, మహిళా భద్రతకి మేము పెద్ద పీట వేస్తున్నామన్నారు.నేరాలకు కారణం అవుతున్న డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం పై ఉక్కు పాదం మోపామని, ఎనిమిది నెలల తర్వాత మహిళలపై అఘాయిత్యాలు మాకు గుర్తుకువచ్చాయని కేటీఆర్ చెప్పడం ఆయన అజ్ఞానానికి అద్దం పడుతుందన్నారు. మహిళలపై ఎక్కడ అఘాయిత్యం జరిగినా.. వెంటనే మా ప్రభుత్వం వాయు వేగంతో స్పందించిందని ఆమె తెలిపారు. గంటల వ్యవధిలోని నిందితులను అరెస్టు చేసిందని, ని%శీ%ధితులపై చట్టపరంగా చర్యలు చేపట్టామన్నారు. లైంగిక దాడుల కేసుల్లో 24 మంది దోషులకు శిక్షలు పడేలా చేశామని మంత్రి సీతక్క తెలిపారు. 20 సంవత్సరాల పాటు జైలు శిక్ష నుంచి యావజ్జివ కారగార శిక్ష వరకు దోషులకు శిక్షలు పడేలా చేశామని, మిగిలిన కేసుల్లోనూ న్యాయవిచారన కొనసాగుతోందన్నారు. ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే బాధితులను పరామర్శించి భరోసా కల్పించామని, ఏలాంటి జాప్యం లేకుండా మంత్రులు, ఎంఎల్ఏ లు, అధికారులు, కార్పొరేషన్ చైర్మన్ లలో ఎవరో ఒకరు ప్రభుత్వం తరఫున వెళ్లి బాధిత కుటుంబానికి అండగా నిలిచారన్నారు మంత్రి సీతక్క.

## ఉస్మానియా మెడికల్ స్టూడెంట్స్ కు శుభవార్త

### ఈనెల 24న నూతన హాస్టల్ భవనాలకు శంకుస్థాపన



**సికింద్రాబాద్ ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** ఉస్మానియా వైద్య కళాశాల విద్యార్థులకు కొత్త వసతి గృహాలు నిర్మించేందుకు ఈనెల 24 తేదీన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఉస్మానియా కళాశాల నిర్మించినప్పుడు వైద్య విద్యార్థుల కొరకు ఏర్పాటుచేసిన వసతి గృహాలు ప్రస్తుతం నివాసయోగ్యంగా లేకపోవడంతో ఈ విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకుపోవడంతో ఆయన వెంటనే స్పందించి రూ.121. 90 కోట్లతో విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా నూతన వసతి గృహాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారని ఆయన తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ చీఫ్ ఇంజనీర్ దేవేంద్ర కుమార్, ఈ ఈ సురేందర్ రెడ్డి బృందం సోమవారం కళాశాలను సందర్శించి 24న జరిగే శంకుస్థాపన ఏర్పాట్లను పర్యవేక్షించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com